Crime Mirror QR Code
https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
16-11-2024
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:14
సంచిక: 6

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## 19న వరంగల్‌కు సీఎం రేవంత్

హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 19న వరంగల్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి పథకాలకు శ్రీకారం చుట్టనున్నారు.

ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో బహిరంగసభ

పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం

ఏడాది పాలనపై 'ప్రజాపాలన విజయోత్సవాలు'




2లో

## డిసెంబర్ 21న జీఎస్టీ కౌన్సిల్ సమావేశం

### దేశ రాజధాని ఢిల్లీలో కౌన్సిల్ భేటీ

### 2025-26 బడ్జెట్‌పై చర్చించే అవకాశం

న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన 55వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం డిసెంబర్ 21న జరగనుంది. దేశ రాజధాని ఢిల్లీలో ఈ భేటీ జరగనుంది. ఈ సమావేశంలో 2025-26 బడ్జెట్‌పై చర్చించనున్నారు.



## చట్టానికి పదును పెడుతున్నాం

### సోషల్ మీడియా ద్వారా సైకోలను తయారు చేశారు

- గడిచిన ఐదేళ్లలో వివిధ కార్పొరేషన్ల ద్వారా వారికి జీతాలు
- ఇలాంటివాళ్లు రాష్ట్రంలో ఉండటానికి వీల్లేదు
- సొంత పార్టీ నేతలపైనా కఠినంగా వ్యవహరిస్తాం
- ఆడ బిడ్డల జోలికొస్తే ఉక్కుపాదంతో అనిచివేస్తాం
- సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

అమరావతి, (క్రైమ్ మిర్రర్): జగన్‌పై మరోసారి విరుచుకుపడ్డారు సీఎం చంద్రబాబు. గడిచిన ఐదేళ్లు సోషల్ మీడియా ద్వారా సైకోలను తయారు చేశారని మండిపడ్డారు. వివిధ కార్పొరేషన్ల ద్వారా వారిని జీతాలు చెల్లించారన్నారు. చివరకు కన్నతల్లిపై పోస్టులు పెట్టారని దుయ్యబట్టారు. ఇదొక ఆర్గనైజ్డ్ క్రైమ్‌గా వర్ణించారు. వీరు మనుషులా..

మిగతా 2లో

మాజీ సిఎ కెసిఆర్ బాటలోనే.. రేవంత్‌రెడ్డి ప్రయాణిస్తున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ ల డిఎన్ఎ ఒక్కటేనని.. రెండు పార్టీలు డ్రామాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. మాటలు, విమర్శలతో రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్, బిఆర్ఎస్ లతో తెలంగాణకు ఒరిగిందేమి లేదని కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ రాష్ట్రం ఏటిఎంగా మారిందని ఆరోపించారు.

## కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ ఒక్కటే

కాంగ్రెస్ పార్టీకి ఏటిఎంగా తెలంగాణ రాష్ట్రం

కెసిఆర్ బాటలోనే సిఎం రేవంత్ రెడ్డి

తిట్ల పురాణంతో తెలంగాణ పరువు తీస్తున్నారు

పోలీస్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

చర్చల వ్యవహారం.. కలెక్టర్‌పై దాడి వరకు వెళ్లింది

మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకం కాదు...

పేదల ఇళ్లు కూల్చివేతకే తాము వ్యతిరేకం

మూసీ పరివాహక ఇళ్లల్లో నేడు బిజెపి నేతల నిద్ర

రైతులకు బోనస్ ఇస్తామని.. బోగస్ చేశారు

శిల్పకళావేదికలో 21 నుంచి 24 వరకు లోక్ మంథన్



హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్): మాజీ సిఎ కెసిఆర్ బాటలోనే.. రేవంత్‌రెడ్డి ప్రయాణిస్తున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ ల డిఎన్ఎ ఒక్కటేనని.. రెండు పార్టీలు డ్రామాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. మాటలు, విమర్శలతో రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్, బిఆర్ఎస్ లతో తెలంగాణకు ఒరిగిందేమి లేదని కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ రాష్ట్రం ఏటిఎంగా మారిందని ఆరోపించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మరోసారి ఫైరయ్యారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే బస్తీ దావఖానాలు నడుస్తున్నాయని ఆయన చెప్పారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఆలయాలపై దాడులు జరుగుతుంటే.. ప్రభుత్వం, పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్చల ద్వారా పరిష్కరించాల్సిన వ్యవహారం..

మిగతా 2లో

## బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్షసాధింపు

కాంగ్రెస్ కార్యకర్తలను వదిలేసి బీఆర్ఎస్ నాయకులనే జైల్లో వేశారు

విలువైన భూములను వడ్డీపావుసేరులో గుంజుసుకునే ప్రభుత్వం

లగచర్ల రైతన్నలతో కేటీఆర్ ములాఖత్

సంగారెడ్డి,(క్రైమ్ మిర్రర్): కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని కావాలనే జైల్లో



మిగతా 2లో

## ప్రజాస్వామ్యంలో సుప్రీంకోర్టు కీలకం..

ఎవరైనా సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించాల్సిందే

రాజ్యాంగ విరుద్ధంగా వక్ఫ్ బోర్డును తీసుకొచ్చిన కాంగ్రెస్

సుప్రీంకోర్టుకు మించి వక్ఫ్ బోర్డుకు అధికారాలిచ్చారు

వక్ఫ్ బోర్డు అనేది ఒక క్రూరమైన హాస్యం

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శలు

మిగతా 2లో



## ఆదివాసీ మహిళ ముర్మును రాష్ట్రపతిని చేశాం

### గిరిజనులకు అత్యున్నత గౌరవం ఇచ్చిన ఘనత మాదే

### పీఎం జన్‌మన్ యోజన పథకం ఘనత ముర్ముదే

బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా నివాళి

బిర్సాముండా పేరిట పోస్టల్ స్టాంపు ఆవిష్కరణ

ఆదివాసీలను గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయన్న మోడీ

దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఓ ఆదివాసీ మహిళకు తమ ప్రభుత్వం అత్యున్నత రాష్ట్రపతి పదవిని ఇచ్చి గౌరవించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆదివాసీ బిడ్డ ద్రౌపదీ ముర్మును రాష్ట్రపతిని చేయడం ఎన్డీఏ అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

పట్నా,(క్రైమ్ మిర్రర్): దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఓ ఆదివాసీ మహిళకు తమ ప్రభుత్వం అత్యున్నత రాష్ట్రపతి పదవిని ఇచ్చి గౌరవించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆదివాసీ బిడ్డ ద్రౌపదీ ముర్మును

మిగతా 2లో

## అమరావతి తాగునీటి కోసం రూ.14.17 కోట్లు

నేటినుంచి టెండర్లకు ఆహ్వానం



## సోయాబీన్‌కు రూ.7000 ఎంఎస్ ప్లస్ బోనస్ ఇస్తాం

ఉల్లికి సరైన మద్దతు ధర నిర్ణయించేందుకు కమిటీ

పత్తికి మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకుంటాం

మహా రైతులతో వీడియో కాల్‌లో' రాహుల్ గాంధీ



మిగతా 2లో



# కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ ఒక్కటే

(మొదటి పేజీ తరువాయి)

కలెక్టర్ పై దాడి వరకు వెళ్లింది. సిఎం సొంత నియోజకవర్గంలో దాడి జరగడం, రైతుల అరెస్టులు.. అసలు ఏం జరుగుతుందని సర్కార్‌ను నిలదీశారు. రైతులకు బోనస్ ఇస్తామని..బోగస్ చేశారని మండిపడ్డారు. ఇచ్చిన హామీ మేరకు బోనస్ ఇచ్చే సత్తా ఈ సర్కార్ కు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఏ హామీని నెరవేర్చడం లేదుని విమర్శించారు. తెలంగాణలో అభివృద్ధి కుంటుపడిందని.. రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదన్నారు. మూసీ ప్రక్షాళనకు బిజెపి వ్యతిరేకం కాదని.. పేదల ఇండ్లు కూలగొట్టకుండానే ప్రక్షాళన చేయొచ్చని చెప్పారు. తెలంగాణ సమాజాన్ని అవమానించేలా రేవంత్‌రెడ్డి మాటలున్నాయని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చురకలు అంటించారు. పేద ప్రజలకు అన్యాయం చేయొద్దని అంటే బుల్డోజర్‌లతో తొక్కిస్తా అంటావా.. తొక్కించు మేము కూడా చూస్తామని సవాల్ విసిరారు. 'సిస్టం మీకు మాత్రమే ఉందా.. మాకు లేదా.. చట్టం లేదా' అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నామని ఏది పడితే అది మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. రేవంత్ ఇలా మాట్లాడితే పేదల కోసం తాము చావడానికి కూడా సిద్ధమని అన్నారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సవాల్‌ను తాము స్వీకరిస్తున్నామన్నారు. వారి కోసం తమ పదవులు త్యాగం చేసేందుకు తాము రెడీగా ఉన్నామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. 'మా ఎమ్మెల్యే , ఎంపీ పదవులు వదులుకునేందుకు రెడీ. శనివారం రాత్రి బీజేపీ అధ్వర్యంలో మూసీ బాధితుల ఇంట్లోనే ఉంటాం, అక్కడే పడుకుంటాం. మా పార్టీ ఎంపీలు , ఎమ్మెల్యేలు మూసీ , హైడ్రా బాధితుల ఇళ్లలో ఉండాలని నిర్ణయించాం.

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలన్ని నెరవేరుస్తే మేము మూడు నెలలు అక్కడే ఉండేందుకు సిద్ధం. వచ్చే రోజులన్నీ బీజేపీవే. రాబోయే రోజుల్లో మీమే అధికారంలోకి రాబోతున్నం. కేటీఆర్ అరెస్ట్ అంటూ కాంగ్రెస్ డ్రామా ఆడుతుందని కిషన్‌రెడ్డి విమర్శించారు. మహారాష్ట్రలో రేవంత్‌రెడ్డి ఏ మొఖం పెట్టుకుని ప్రచారం చేస్తున్నారని కిషన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. తెలంగాణలో ఆరు గ్యారంటీలు అమలు చేశామని, మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి అబద్దాలు చెబుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. మాటలు ప్రజలకు.. మూటలు పార్టీకి అన్నట్లుగా.. కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి మహారాష్ట్రలో ఏ ముఖం పెట్టుకుని ప్రచారం చేస్తున్నారని ప్రశ్నించారు. అశోక్‌నగర్ లైబ్రరీ వద్ద నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇంకా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించలేదు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లలో వైఫల్యం చెందిందన్నారు. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుచేయలేదని విమర్శించారు. హైదరాబాద్ శిల్పకళావేదికలో ఈనెల 21 నుంచి 24 వరకు లోక్ మంథన్ నిర్వహించనున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. బేగంపేట పర్యాటక భవన్‌లో లోక్ మంథన్‌పై కేంద్రమంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లో ఈ ఏడాదిలో అంతర్జాతీయ సాంస్కృతిక మహోత్సవంగా లోక్‌మంథన్‌ను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈనెల 21న స్టాళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, 22న లోక్‌మంథన్‌ను రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ప్రారంభిస్తారని కిషన్‌రెడ్డి వెల్లడించారు. అదేవిధంగా 24న జరిగే ముగింపు కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, గజేంద్ర సింగ్ షేకావత్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కవులు, కళాకారులు, విదేశీ అతిథులు హాజరుకానున్నట్లు కేంద్రమంత్రి పేర్కొన్నారు. 'రేవంత్ రెడ్డి తెలంగాణలో ఏం చేశారో చెప్పి మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలి. నువ్వు సీఎం అయ్యాక చేసింది ఏంటంటే రెచ్చగొట్టే ప్రసంగాలు , విద్వేష పూరిత వ్యాఖ్యలు తప్ప ఏం ఉంది. మాజీ సీఎం కేసీఆర్ తిట్టినా తిట్ల పురాణాన్ని రేవంత్ రెడ్డి , కేటీఆర్‌లకు అందించినట్లు ఉంది. కేసీఆర్ , రేవంత్ రెడ్డిలు నిరుద్యోగులకు ఏం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో ఫెయిల్ అయ్యారు. ఏ మొహం పెట్టుకుని మహారాష్ట్ర రైతులకు హామీ ఇస్తున్నారు. కౌలు రైతులు , రైతు కూలీల హామీలు ఏమయ్యాయి. 11నెలల్లో ఎంతమందికి రుణామాఫీ చేశారు. పోలీసులు గతంలో ఫామ్‌హౌస్‌ల కోసం పని చేశారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి కోసం పనిచేస్తున్నారు. హైదరాబాద్‌లో దేవాలయాలపై దాడులు జరుగుతుంటే ఏం చేస్తున్నారు.మజ్లిస్ ఆదేశాలకు తలొగ్గి రాహుల్ గాంధీ ద్వారా అసదుద్దీన్ ఓవైసీ హైదరాబాద్ నగర కమిషనర్‌ను ట్రాన్స్‌ఫర్ చేశారు. ఇక్కడ ఇవన్నీ చాలవన్నట్లు మహారాష్ట్ర ప్రచారానికి రేవంత్ వెళ్తున్నారు. కలెక్టర్ల మీద దాడులు, రైతుల మీద కేసులు తప్పా రేవంత్ రెడ్డి సర్కార్ ఏం చేస్తుంది. జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్లకు కోట్ల రూపాయాలు పెండింగ్‌లో ఉన్నాయి. కేసీఆర్ పుణ్యమా అని రూ. 8లక్షల కోట్లు అప్పు ఏర్పడింది. కేసీఆర్ , రేవంత్ రెడ్డి వైఖరీ ఓటు బ్యాంకు రాజకీయం చుట్టూ తిరుగుతుంది' అని కిషన్ రెడ్డి విమర్శించారు.

# 19న వరంగల్‌కు సీఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

ఆర్ట్స్ కాలేజీ మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. స్వయం సహాయ బృందాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలతో సమావేశమై ఆ గ్రూపులకు సంబంధించిన ఆస్తుల పంపిణీ చేస్తారు. సీఎం పర్యటన ఏర్పాట్లను సమీక్షించేందుకు సచివాలయంలో శుక్రవారం ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. దేవాదాయ, అటవీ శాఖల మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి వరంగల్ పర్యటన రూట్ మ్యాప్, వేదిక ఏర్పాట్లు, పార్కింగ్ తదితర అంశాలపై చర్చించారు. సభకు వచ్చే మహిళలు ఎక్కువ దూరం నడవకుండా పక్కాగా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని మంత్రి కొండా సురేఖ అధికారులను కోరారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు, పిల్లల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల చిత్రాలను సభ వద్ద ప్రదర్శించాలని సూచించారు. సీఎం సభ, ఇతర కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా ప్రచారం నిర్వహించాలని కోరారు. సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శని, ఆదివారాల్లో మహారాష్ట్ర అసెంబ్లీకి జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి బయల్దేరి ఉదయం 10 గంటలకు నాగ్‌పూర్ చేరుకుంటారు. అక్కడ నుంచి చంద్రాపూర్‌లో స్థానిక నేతలతో కలిసి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం వరుసగా రాజురా, డిగ్రాస్, వార్ధానియోజకవర్గాల్లో ప్రచార సభలు, రోడ్ షోలలో పాల్గొని రాత్రికి తిరిగి నాగ్‌పూర్‌చేరుకుంటారు. రెండోరోజు ఆదివారం ఉదయం నాగ్‌పూర్ నుంచి నాందేడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి నయగావ్, భోకర్, షోలాపూర్‌నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. అదే రోజు తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు.

# ప్రజాస్వామ్యంలో సుప్రీంకోర్టు కీలకం..

(మొదటి పేజీ తరువాయి)

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ఔరంగజేబు విధానాలు ఇప్పటికీ ప్రజలను పీడిస్తున్నాయని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 300 ఏళ్ల క్రితం ఔరంగజేబు నోటి మాటతో భూములు ఇచ్చి ఉండొచ్చు. కానీ, నేడు కుప్పలు కుప్పలుగా డాక్యుమెంట్స్‌తో ఆ భూములు మావి అని అంటున్నారు. ప్రజాస్వామ్యంలో సుప్రీంకోర్టు కీలకం.. ఎవరైనా సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించాల్సిందే. రాజ్యాంగానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ వక్ఫ్ బోర్డును తీసుకొచ్చింది. సుప్రీంకోర్టుకు మించి వక్ఫ్ బోర్డుకు అధికారాలిచ్చారు. వక్ఫ్ బోర్డు అనేది ఒక క్రూరమైన హాస్యం. నవ్వాలో.. ఏడవాలో.. బాధపడాలో తెలియని పరిస్థితి. శీతాకాల సమావేశాల్లో వక్ఫ్‌బోర్డు బిల్లు పార్లమెంట్‌లో పాస్ అవుతుంది. వక్ఫ్ బోర్డు సవరణ చట్టం ముస్లిం సమాజానికి వ్యతిరేకం కాదని ఎంపీ అన్నారు.

# చట్టానికి పదును పెడుతున్నాం

(మొదటి పేజీ తరువాయి)



జంతువులా? అంటూ ప్రశ్నించారు. సొంత పార్టీ నేతలపైనా కఠినంగా వ్యవహరిస్తామని సభ వేదికగా చెప్పారు. చట్టానికి పదును పెడతామన్నారు. ఇలాంటివాళ్లు రాష్ట్రంలో ఉండటానికి వీల్లేదన్నారు. ఆడ బిడ్డల జోలికొచ్చినవారిని ఉక్కుపాదంతో వారిని అణిచివేస్తామన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ రాష్ట్రాన్ని జగన్ ప్రభుత్వం సర్వనాశనం చేసిందన్నారు సీఎం చంద్రబాబు. అప్పటి ప్రభుత్వ జీవోలు, కాగ్ రిపోర్టులు సైతం బయట పెట్టలేదన్నారు. సింపుల్‌గా చెప్పాలంటే విభజన కంటే.. ఐదేళ్లలో నాశనం చేసిందే ఎక్కువన్నారు. శాసనసభలో బడ్జెట్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అని చెప్పినా వినలేదన్నారు ముఖ్యమంత్రి. అమరావతి గొప్ప నగరంగా తయారుకాకుండా అడ్డుకున్నారని చెప్పారు. పోలవరం ప్రాజెక్టుని దెబ్బతీశారని, నదులు అనుసంధానం అయితే రాష్ట్రంలో కరువు అనేది ఉండదన్నారు. వచ్చిన పెట్టుబడులను వైసీపీ ప్రభుత్వం తరిమేసిందని ఆందోళన వ్యక్తం చేశారు సీఎం చంద్రబాబు. బడ్జెట్‌పై సభలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలపై తనదైన శైలిలో రిప్లై ఇచ్చారు. ఆస్తులు సృష్టి లేదు.. సంపద లేదన్నారు. దీనివల్ల ఆదాయం తగ్గి, ఖర్చులు పెరిగాయన్నారు. అప్పులు తెచ్చి ఆస్తులు తాకట్టు పెట్టారని గుర్తు చేశారు. శాంతి భద్రతల విషయంలో ఏ మాత్రం రాజీ లేదన్నారు. రాజకీయ ముసుగులో నేరాలు చేయాలని భావిస్తే సహించేది లేదన్నారు. ప్రజలకు సెక్యూరిటీ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అసెంబ్లీకి నేతలు రాకపోవచ్చు.. ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అలాగే ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీల గురించి వివరించారు. కేంద్రం సహకారంతో అమరావతి, పోలవరం ప్రాజెక్టు పనులు మొదలవుతున్నాయని తెలిపారు. నదులు అనుసంధానం అయితే కరువు అనే మాట రాదన్నారు. దక్షిణాదిలో ఇదే ఫస్ట్ రాష్ట్రం అవుతుందన్నారు. రాష్ట్రాన్ని పెట్టుబడులు రప్పించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నామన్నారు సీఎం. తాను అన్నీ చేశామని చెప్పలేదన్న ముఖ్యమంత్రి, రాబోయే రోజుల్లో ఎలాంటి సమస్య ఉండదని పెట్టుబడుదారులకు భరోసా ఇచ్చామన్నారు. ఎప్పుడూ చూడని విధ్వంసం రాష్ట్రంలో చూశామని, వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయన్నారు సీఎం చంద్రబాబు. అన్నింటినీ గాడిలో పెడుతున్నామని వెల్లడించారు. ఆర్థిక స్థితిని గాడిలో పెట్టేందుకు చేయాల్సిన పనులు వేగంగా చేస్తున్నామని తెలిపారు. ఇది కేవలం ప్రారంభం మాత్రమేనన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో ఇదొక బెస్ట్ బడ్జెట్ అని, ఇది కేవలం కేంద్రం ద్వారానే సాధ్యమైందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు ఎలాంటి విఘాతం కలగకుండా చేసుకుంటూ వెళ్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు.మంచి ప్రభుత్వం– చెడు ప్రభుత్వం మధ్య తేడాను ప్రజలు గుర్తించాలన్నారు. సభ్యులు అన్నివిధాలుగా సహరిస్తున్నారని, సభ నిండుగా ఉందన్నారు. అలాగే డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును చూస్తే.. కుర్చీ కూడా కళకళలాడుతోందని నవ్వుతూ అన్నారు.

# సోయాబీన్‌కు రూ.7000 ఎంఎస్ ప్లస్ బోనస్ ఇస్తాం

**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ దూసుకుపోతుంది. అన్ని వర్గాల వారికి ఉపయోగపడేలా పథకాలు రచిస్తూ ముందుకు వెళుతోంది. ఆ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ సైతం మహారాష్ట్ర ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ మహారాష్ట్ర రైతులతో వీడియో కాల్ మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు తమ బాధలను రాహుల్ గాంధీకి చెప్పుకుని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రాహుల్ ఎన్నికల్లో గెలిపిస్తే పలు హామీలు అమలు చేస్తామని వారికి చెప్పారు. వచ్చే డబ్బులతో తమ బిడ్డలను ఏం చదివిస్తామో.. ఏం తిండి పెడతామో అర్థం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మహారాష్ట్ర రైతుల కోసం మహావికాస్ అఘాడీ కూటమి చారిత్రాత్మక అడుగులు వేస్తామని హామీ ఇచ్చారు. సోయాబీన్ కు క్వింటాలుకు రూ.7000 ఎంఎస్ ప్లస్ బోనస్ ఇస్తామని చెప్పారు. ఉల్లికి కూడా సరైన మద్దతు ధర నిర్ణయించేందుకు కమిటీ వేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా పత్తికి కూడా మద్దతు ధర ఇచ్చి ఆ రైతులను సైతం ఆదుకుంటామని చెప్పారు. గత మూడు ఎన్నికలలో సోయాబీన్ కు రూ.6వేల రూపాయలు ఎంఎస్పీ ఇస్తామని బీజేపీ వాగ్దానం చేసిందని చెప్పారు. కానీ నేటికీ రైతులు తమ రక్తం, చెమటతో పండించిన సోయాబీన్ కు రూ.3వేల నుండి రూ.4వేల రూపాయలకు అమ్ముతున్నారని చెప్పారు.

## అమరావతి తాగునీటి కోసం రూ.14.17 కోట్లు

### నేటినుంచి టెండర్లకు ఆహ్వానం

అమరావతి,నవంబర్15(ఆర్ఎన్ఎ):రాజధాని అమరావతిలో తాగునీటి సరఫరా కోసం రూ.14.17 కోట్ల రూపాయలతో రాష్ట్ర ప్రభుత్వం మూడు టెండర్లు పిలిచింది. శనివారం నుండి టెండర్లు దాఖలుచేసుకునే అవకాశం కల్పించారు. 30వ తేదీతో ఈప్రక్రియ ముగించనున్నారు. ప్రస్తుతం రాజధాని పరిధిలోని తుళ్లూరు మండల గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. అనంతవరం, నెక్కల్లు, శాఖమూరు, ఐనవోలు వంటి గ్రామాల్లో నీటి సమస్య మరీ తీవ్రంగా ఉంది. తాజా టెండర్ల ప్రతిపాదన ప్రకారం హరిశ్చంద్రాపురం వద్ద కృష్ణానదిలో చిన్నబావి నిర్మించి అక్కడ నుండి ఇన్‌టేక్ వెల్ ద్వారా ఎ÷–లాంటులోకి తీసుకుని శుభ్రం చేసి, గ్రామాలకు సరఫరా చేసే విధంగా ఎ÷–లాను రూపొందించారు.

### బీఆర్ఎస్ కార్యకర్తలపై

# కక్షసాధింపు

(మొదటి పేజీ తరువాయి)

పెడుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. లగచర్లలో అధికారులపై దాడికి పాల్పడ్డ వారిలో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఉన్నారని కేటీఆర్ తెలిపారు. సంగారెడ్డి జైల్లో లగచర్ల రైతన్నలతో కేటీఆర్ శుక్రవారం ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. తమ భూములు తమకే ఉండాలని లగచర్ల రైతులు పోరాడుతున్నారు. మార్కెట్‌లో ఎకరం రూ. 70 లక్షల విలువ ఉన్న భూములను అడ్డికి పావుశేరుకు రియల్ ఎస్టేట్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం గుంజేసుకుంటుందని రైతులు చెబుతున్నారు. కేవలం ఎకరం భూమి రూ. 10 లక్షలకు గుంజేసుకుంటున్నారని రైతులు బాధపడుతున్నారు. ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా రైతులు 9 నెలలగా పోరాటం చేస్తున్నారు. లగచర్ల, హకీంపేటతో పాటు మరో రెండు తండాల ఆడబిడ్డలు రోదిస్తున్నారు. కష్టపడి సాధించుకున్న తెలంగాణలో రేవంత్ రెడ్డి రాబందు మాదిరిగా వ్యవహరిస్తున్నారు. ఫార్మా కంపెనీలు కాలుష్యమని ఆయన ప్రచారం చేశారు. అదే ఫార్మాను కొడంగల్ తెస్తా.. 3 వేల ఎకరాలు రావాలని పేదల భూములు గంజుకుంటున్నారు. దీంతో స్థానిక రైతులు మర్లబడ్డారు. 9 నెలలుగా పోరాటం చేస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. అధికారుల ముందు నిరసన తెలిపితే దాడుల పేరిట అరెస్టులు చేసి జైల్లో వేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఇవాళ లగచర్లలో దుర్మార్గమైన పరిస్థితి నెలకొని ఉంది. కులగణనలో పాల్గొని వచ్చిన పంచాయతీ సెక్రటరీని కూడా అరెస్టు చేసి జైల్లో వేశారు. ఆ సంఘటనలో పాల్గొనలేదు.. అయినా తనను జైల్లో వేశారని ఆ యువకుడు చెబుతున్నాడు. ఇంకో యువకుడు వనపర్తిలో చదవుకుంటున్నాడు. ఈ ఘటన గురించి తెలుసుకుని మా ఇంటి వాళ్లు ఎలా ఉన్నారో అని వస్తే నన్ను కూడా తీసుకెళ్లారని చెప్పారు. 70 మందిని అరెస్టు చేసి రెండు డీసీఎంలలో తీసుకెళ్లారని చెప్పారని కేటీఆర్ తెలిపారు. దుద్యాల మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్ అనుచరులు కూడా ఈ దాడుల్లో పాల్గొన్నారు. వారి భూములు కూడా ఈ ఫార్మా విలేజ్‌లో పోతున్నాయి. రమేశ్, నర్సింహులు, రాములు అనే కాంగ్రెస్ కార్యకర్తలు కూడా దాడులు చేశారు. 70 మందిని తీసుకెళ్తే.. తిరుపతి రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ కార్యకర్తలను వదిలేశారట. బీఆర్ఎస్ వాళ్లు 21 మందిని రిమాండ్‌కు పంపి.. మిగతా వారిని ఇంటికి పంపించచారట. కేవలం బీఆర్ఎస్ వాళ్లనే మాత్రమే జైల్లో పెట్టాలని అనుముల తిరుపతి రెడ్డి ఆదేశాలు ఇచ్చారట. ఎలాంటి పదవి లేని తిరుపతి రెడ్డికి అధికారులు, పోలీసులు మోకరిల్లుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

# ఆదివాసీ మహిళ ముర్మును రాష్ట్రపతిని చేశాం

(మొదటి పేజీ తరువాయి)




రాష్ట్రపతిని చేయడం ఎన్డీఏ అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. మొదట్లో ఆ పదవికి ఆమె పేరును ప్రతిపాదించగానే ముర్మును భారీ మెజారిటీతో గెలిపించాలని బిహార్ సీఎం నితీశ్ కుమార్ దేశం మొత్తానికి పిలుపునిచ్చారని ప్రధాని గుర్తుచేసుకున్నారు. పీఎం జన్‌మన్ యోజన పథకం ద్వారా పనుల ప్రారంభ ఘనత ద్రౌపదీ ముర్ముదే అని కొనియాడారు. ఆదివాసీల కష్టాలను తీర్చేందుకు ఈ పథకం ద్వారా రూ.24వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని ప్రధాని నరేంద్రమోదీ వెల్లడించారు. బిహార్‌లో నిర్వహించిన సభలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ఆదివాసీలు తమ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ధర్తీ అబా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా బీహార్‌లోని జాముయ్‌లో ప్రధాని మోడీ ఆయనకు నివాళులర్పించి, ఆయన పేరిట పోస్టల్ స్టాంపును విడుదల చేశారు. 6000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. గిరిజన సమాజాన్ని నిర్లక్ష్యం చేయడానికి గత ప్రభుత్వాలే కారణమని ప్రధాని మోడీ అన్నారు. గత ప్రభుత్వాల వల్ల గిరిజన సమాజం నిర్లక్ష్యానికి గురైందన్నారు. గిరిజన సమాజం దేశాభివృద్ధి రేసులో వెనుకబడింది. దేశ స్వాతంత్ర్యానికి ఒక పార్టీ లేదా ఒక కుటుంబం సహకరించిందని చేసే ప్రచారం తప్పన్నారు. గిరిజన సమాజంలోని ఎందరో మహానాయకులు త్యాగాలు చేశారని ప్రధాని మోడీ అన్నారు. గిరిజన సమాజం చేసిన కృషికి చరిత్రలో సముచిత స్థానం దక్కలేదన్నారు. ఏళ్ల తరబడి గిరిజన సంఘం నిర్లక్ష్యానికి గురైంది. గిరిజన సమాజం, సహకారం, త్యాగాన్ని తుడిచిపెట్టే ప్రయత్నం జరిగిందన్నారు. అత్యంత వెనుకబడిన గిరిజనులపై ఎలాంటి శ్రద్ధ తీసుకోలేదన్నారు. వారి జీవితాల్లోని కష్టాలను తగ్గించడానికి, మా ప్రభుత్వం 24 వేల కోట్ల రూపాయలతో ప్రధానమంత్రి జన్మన్ యోజనను ప్రారంభించింది. దేశంలోని అత్యంత వెనుకబడిన గిరిజనుల ఆవాసాల అభివృద్ధికి ఈ పథకం భరోసా ఇస్తోందని అన్నారు. అత్యంత వెనుకబడిన గిరిజనులకు మన ప్రభుత్వం వేల సంఖ్యలో శాశ్వత గృహాలను ఇచ్చిందని ప్రధాని అన్నారు. రాముడిని యువరాజును చేసింది గిరిజన సమాజమేనని ప్రధాని మోడీ అన్నారు. భారతదేశ సంస్కృతిని, స్వాతంత్ర్య పరిరక్షణ కోసం వందల ఏళ్లుగా పోరాటానికి నాయకత్వం వహించినది గిరిజన సమాజం. భారతదేశ సంస్కృతి, స్వాతంత్య పరిరక్షణ కోసం గిరిజన సమాజం వందల ఏళ్ల పాటు పోరాటాన్ని నడిపిందన్నారు. గిరిజన సమాజం ప్రకృతిని, ప్రాచీన వైద్య విధానాలను సజీవంగా ఉంచిందన్నారు. గత ప్రభుత్వాలు వెనకబడిన వర్గాల సంక్షేమం గురించి ఎప్పుడూ ఆలోచించలేదని.. వారి అభివృద్ధి కోసం కృషి చేయలేదని ప్రధాని విమర్శించారు. సమాజానికి దూరంగా నివసిస్తున్న ఆదివాసీలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. వారు పండించే దాదాపు 90 అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ఇచ్చామన్నారు. ఆదివాసీ యువత క్రీడలలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారని.. వారిని మరింత ప్రోత్సహించడానికి అనేక క్రీడా సౌకర్యాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు.

# లగచర్ల ఘటనలో బీఆర్ఎస్ కుట్ర

### రైతులను రెచ్చగొడుతున్న కేటీఆర్, హరీశ్‌రావు : మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): లగచర్ల ఘటన బీఆర్ఎస్ పార్టీ కుట్రేనని, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు రైతులను రెచ్చగొడుతున్నారని మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆరోపించారు. ఆర్థిక ఇబ్బందులూ ఉన్నా రైతులకు ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుంటామని అన్నారు.ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసి తమకు అప్పగించారని విమర్శించారు. అయినా తాము నిధులు సమకూర్చుకుంటున్నామని చెప్పారు. హరీష్ రావు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. ఈరోజు(శుక్రవారం) గాంధీభవన్‌లో మంత్రి శ్రీధర్ బాబు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "సన్నాలు పండించిన ప్రతీ రైతుకు బోనస్ ఇస్తాం. రైతులు ఎవరు చింతించవద్దు..అందరికీ బోనస్ ఇస్తాం. ధాన్యం సేకరించిన



వారం రోజుల్లోపే రూ.500 బోనస్ ఇస్తాం.సూచనలు చేయండి కానీ దుష్ప్రచారం చేయకండి. ప్రభుత్వ అధికారులను తరిమి కొడతామని అగ్ర నేతలు చెప్పారు. అధికారులపై దాడి చేస్తే ఖండిచకుండా ఆహ్వానిస్తారా. కలెక్టర్ గ్రూప్ వన్ అధికారిని చంపే ప్రయత్నం జరిగిందా లేదా. ప్రజాస్వామికంగా మేము ముందుకు వెళ్తున్నాం. భయభ్రాంతులకు గురి చేస్తాం, యంత్రాంగాన్ని భయపెడతాం అంటే కరెక్టేనా. ప్రభుత్వాన్ని అస్థిర పరిచే కుట్ర జరుగుతోంది. బీఆర్ఎస్ , బీజేపీ కలిసి కుట్ర చేస్తున్నాయి" అని మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు విమర్శించారు.



# మామీద కోపంతో పేదలకు నష్టం చేయొద్దు

### రైతులను జైళ్ల నుంచి విడుదల చేయాలి

### రేవంత్‌కు తప్పకుండా పేదోడి ఉసురు తగులుతుంది : కేటీఆర్

సంగారెడ్డి, (క్రైమ్ మిర్రర్): మామీద ఉన్న కోపంతో పేదలకు నష్టం చేయొద్దని, సీఎం రేవంత్ రెడ్డి దమ్ముంటే మాతో కొట్లాడు.. రాజకీయంగా తలపడు కానీ పేదలకు మాత్రం కష్టం కలిగించొద్దు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. లగచర్ల రైతులపై నమోదు చేసిన కేసులన్నీ రద్దు చేసి, వెంటనే వారిని జైళ్ల నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. సంగారెడ్డి జైల్లో లగచర్ల రైతులతో ములాఖత్ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ శివార్లలో ఫార్మాసిటీ కేసీఆర్ పెడితే రేవంత్ వాళ్ల కుటుంబ సభ్యుల కోసం మార్చారు. లగచర్లతో పాటు సంగారెడ్డి జిల్లా న్యాలకల్‌లో కూడా రైతులు పోరాటం చేస్తున్నారన్నారు. కేసీఆర్ మీకు అండగా ఉంటారు... ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఎదుర్కొంటాం.. ఈ ప్రభుత్వానికి తప్పకుండా పేదవాడి ఉసురు తగులతది. 30, 40 కిలోల బరువు లేని పిల్లలు కలెక్టర్‌పై హత్యాయత్నం చేశారని కేసులు పెట్టడానికి మనసు ఎలా ఒప్పింది రేవంత్ రెడ్డి..? చేతనైతే మాతో కొట్లాడు. రాజకీయంగా మాతో తలపడు. పేదలకు కష్టం కలిగించొద్దు. ఈ కేసులన్నీ రద్దు చేసి రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాను. రైతులకు, పేదలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది. గర్భిణి అయిన జ్యోతిని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ రేపు హాస్పిటల్‌కు తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయిస్తుంది. పేద వర్గాలకు అండగా నిలబడడమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని కేటీఆర్ స్పష్టం చేశారు.

# వరి సాగులో తెలంగాణ అగ్రస్థానం

### 7411ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): వరి సాగు ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కోటీ 53లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడితో సన్న రకాలు 25నుంచి 40లక్షల ఎకరాలకు పెరిగిందని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం సన్నాలకు బోనస్ ప్రకటించడమే అందుకు కారణమని అన్నారు. సంక్రాంతి నుంచి రేషన్‌తో సహా అన్ని హాస్టళ్లకు సన్న బియ్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. దొడ్డు రకం వరి సాగు 41లక్షల నుంచి 21 లక్షల ఎకరాలకు పడిపోయిందని చెప్పారు. రాష్ట్ర అవసరాలే కాకుండా ఇతర దేశాలకు ఎగుమతి అయ్యే అవకాశం ఉందన్నారు. 7411ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అధికారం కోల్పోయిన పార్టీ అధికారం కోసం రైతుల ఆత్మ స్థైర్యం దెబ్బ తీసే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. "అన్ని గ్రామ పంచాయితీల్లో కొనుగోలు కేంద్రాలు పెట్టం. వడ్లు ఆరపోసిన దగ్గర రైతులు ఆందోళన చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఆధిపత్య పోరు ఉండొచ్చు. రాష్ట్రంలో రెండో స్థానం కోసం బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఆధిపత్య పోరు ఉండొచ్చు. మీ ఆధిపత్య పోరు కోసం రైతాంగాన్ని ఆందోళనకు గురిచేయొద్దు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గైడ్ లైన్స్ ప్రకారమే మేము ధాన్యం కొనాలి. మీకు రైతుల మీద ప్రేమ ఉంటే గైడ్ లైన్స్ మార్చండి..కృత్రిమ ఆందోళనతో శునకానందం పొందడం సరికాదు. సబ్ కమిటీ రిపోర్ట్ వచ్చాక రైతు భరోసా ఇస్తాం. రైతులను ఇబ్బంది పెట్టే రాజకీయ క్రీడను పార్టీలు మానుకోవాలి" అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# ఖానాపూర్ అడవుల్లో పులి సంచారం కలకలం



నిర్మల్,(క్రైమ్ మిర్రర్): నిర్మల్ జిల్లా ఖానాపూర్ అడవుల్లో సంచారం స్థానికంగా కలకలం రేపుతోంది. ఫారెస్ట్ అధికారులు అడవిలో ఏర్పాటు చేసిన కెమెరాల్లో పులి సంచరిస్తున్న దృశ్యాలు రికార్డయ్యాయి. దీంతో ఖానాపూర్ సరిహద్దు అటవీ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు. ఒంటరిగా ఎవరూ అడవిలోకి వెళ్లొద్దని, సాయంత్రం త్వరగా ఇండ్లకు చేరుకోవాలని చూసుకోవాలని సూచించారు. అటవీశాఖ అధికారుల హెచ్చరికతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పెద్ద పులి ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తుందేమోనని భయపడుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి పులిని బంధించాలని కోరుతున్నారు.

# సమగ్ర సర్వేపై తప్పుడు ప్రచారం చేస్తే సహించం

### సొంత ప్రయోజనాల కోసం కొందరు తప్పుడు ప్రచారాలు

### ఇప్పటికే 30శాతం సర్వే పూర్తి..విధుల్లో 87వేల ఎన్యుమరేటర్లు



సిద్దిపేట, (క్రైమ్ మిర్రర్): కొందరు కావాలనే వారి ప్రయోజనాల కోసం సమగ్ర సర్వేపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. సర్వేలో ఎలాంటి బ్యాంక్ వివరాలు అడగటం లేదని స్పష్టం చేశారు. 87వేల ఎన్యుమరేటర్లను పెట్టి సర్వే జరిపిస్తున్నామని అన్నారు. ఇప్పటికే 30శాతం సర్వే పూర్తి అయ్యిందని తెలిపారు. సర్వే వల్ల ఎలాంటి నష్టం జరగదని అన్నారు. కొండపాక మండలం దుద్దేడ గ్రామంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ...దేశానికి దిక్సూచిగా సర్వే నిలబడుతుందన్నారు. సర్వే కావాలని కోరిన వారే నేడు కనబడటం లేదని చెప్పారు. సర్వేను అడ్డుకున్న వారిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా అందరికీ గ్రంథాలయ వారోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టణంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి పాల్గొన్నారు."గ్రంథాలయాలు నిరుద్యోగ యువతకు చదువుకోవడానికి ఉపయోగపడేలా చేయాలి. ఈరోజు ఎంప్లాయ్‌మెంట్ క్యాలెండర్ విడుదల చేస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం 11 నెలల్లో 45 వేల ఉద్యోగాలు ఇచ్చింది. చదివిన జ్ఞానం జీవితంలో ఏదో చోట ఉపయోగపడుతుంది. ప్రపంచంలో ఏం జరుగుతుంది అనేది తెలుసుకునే వేదిక గ్రంథాలయం. సిద్దిపేట గ్రంథాలయం రాష్ట్ర గ్రంథాలయాలకు దీటుగా అభివృద్ధి చేస్తాం. నెహ్రూ ఐఐటీ, ఎయిమ్స్, విద్యాలయాలు, సాంకేతికత రంగంలో అభివృద్ధి చేయడం వల్లనే నేడు దేశం ముందుకు వెళ్తుంది. నెహ్రూ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ చదవాలి. బ్రాంచ్ లైబ్రరీల సంఖ్య తక్కువగా ఉంది కావాల్సిన మెటీరియల్ అందించాలి" అని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఉన్న రైతులు అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. సన్న వడ్లు పండించిన రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇవ్వడం జరుగుతుంది.. కానీ ప్రతిపక్ష పార్టీల నాయకులు రాద్ధాతం చేయకుండా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లాకో సీనియర్ అధికారిని నియమించి ధాన్యం కొనుగోలును పర్యవేక్షిస్తున్నామన్నారు.



# కల్వకుర్తి నియోజకవర్గంలో మావోయిస్టుల లేఖలు

### భూ దాహాన్ని ఖండిస్తూ లేఖలు విడుదల

మహబూబ్‌నగర్, (క్రైమ్ మిర్రర్): సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో మావోయిస్టుల లేఖలు కలకలం సృష్టించాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కొడంగల్, కల్వకుర్తి నియోజకవర్గంలో చేస్తున్న భూదాహానికి వ్యతిరేకంగా మావోయిస్టులు తీవ్రంగా ఖండిస్తూ లేఖలు విడుదల చేయడం సంచలనం సృష్టిస్తోంది. సీఎం సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లితో పాటు కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ, మాడుగుల, ఆమనగల్ మండలాల్లో ఈ లేఖలు ప్రకంపనలు సృష్టించాయి. అలాగే సీఎం సొంత నియోజకవర్గమైన కొడంగల్‌ని లగచర్లలో ఏర్పాటు చేస్తున్న ఫార్మాసిటీకి వ్యతిరేకంగా పోరాడుతున్న గిరిజనులకు తమ మద్దతును తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే పెట్టుబడి వర్గాలకు కొమ్ముకాస్తూ కార్పొరేట్ల ప్రయోజనాల కోసం పనిచేస్తుందని, పేద ప్రజల హక్కులను కాలరాస్తుందని మండిపడ్డారు. ఈ లేఖలు ప్రధానంగా సీఎం ఆయన సోదరుల ఉద్దేశించి ఉండడంతో పోలీసులు యంత్రాంగం దృష్టి సారించింది. ఈ లేఖలు ఎవరు పంపిణీ చేశారు? ఎలా గ్రామాల్లోకి చేరాయి? అనేదానిపై ఆరా తీస్తున్నారు. మరోవైపు కల్వకుర్తి ప్రాంతంలో బిగ్ బ్రదర్స్ దాదాపు 900 ఎకరాలను అక్రమంగా రైతుల నుంచి తీసుకునేందుకు గత కొన్ని రోజుల నుంచి ప్రయత్నిస్తోంది. ఈ భూములన్నీ బడా భూస్వాములకు చెందినవి. అయితే గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే రైతులకు ఓఆర్సీలు ఇచ్చి హక్కు కల్పించింది. మళ్లీ అదే కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ సారథ్యంలో ఈ భూములను లాక్కునే ప్రయత్నం చేస్తుందని మావోయిస్టులు ఆరోపిస్తున్నారు. మొత్తంగా వరుసగా మావోస్టులు బహిరంగా లేఖలు విడుదల చేయడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# త్వరలోనే బిఆర్ఎస్ నుంచి మరిన్ని చేరికలు

### కాంగ్రెస్‌లో చేరేందుకు రెడీగా ఎమ్మెల్యేలు

### పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి



హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): కాంగ్రెస్ పార్టీలో త్వరలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల చేరికలు ఉంటాయని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు.బీఆర్ఎస్ పార్టీలోని అగ్ర నాయకులు, మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్ ఒకే పార్టీలో ఉండరని ఈ సందర్భంగా ఆయన జోస్యం చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి కేబినెట్ విస్తరణపై ఇప్పటికే సంప్రదింపులు పూర్తయ్యాయని తెలిపారు. తనకు, సీఎం రేవంత్ రెడ్డికి మధ్య మంచి సన్నిహిత సంబంధాలున్నాయన్నారు. అయితే బీఆర్ఎస్‌లోని పలువురు కీలక నేతలు బీజేపీలోకి వెళ్తారని ఆయన పేర్కొన్నారు. ఇక శనివారం నుంచి తాను జిల్లాల పర్యటన చేస్తానని.. అందులోభాగంగా ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తానని చెప్పారు. అలాగే పార్టీల్లో ఉన్న ఇబ్బందులను సైతం సరి చేస్తానని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. మరోవైపు ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా కేబినెట్ విస్తరణతోపాటు పలు అంశాలపై పార్టీ పెద్దలతో ఆయన చర్చించినట్లు తెలుస్తుంది. అలాగే రాష్ట్రంలో ప్రస్తుతం కుల గణన జరుగుతుంది. అదే విధంగా మరికొద్ది రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఆయా అంశాలపై సైతం ఆయన పార్టీ సీనియర్లతో చర్చించినట్లు సమాచారం. ఇంకోవైపు గతేడాది చివరల్లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో తెలంగాణ ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం కొలువు తీరింది. దాంతో బీఆర్ఎస్ ప్రతిపక్షానికి పరిమితమైంది. ఇక సీఎం రేవంత్ రెడ్డి చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్‌లో పలువురు బీఆర్ఎస్ అగ్రనేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో బీఆర్ఎస్ పార్టీలో కేవలం కేసీఆర్ ఫ్యామిలీ మాత్రమే ఉన్నదన్నట్లుగా పరిస్థితి మారింది.ఇక ఈ ఏడాది మే, జూన్ మాసాల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు దాదాపు అన్ని ఎంపీ స్థానాలను కైవసం చేసుకున్నాయి. అదే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు కనీసం డిపాజిట్ కూడా దక్కక పోవడం గమనార్హం. మరికొద్ది రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో సైతం అన్ని విజయావకాశాలను ఒడిసి పట్టుకోవాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. అందుకోసం రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్‌లోని అగ్రనేతలను సైతం పార్టీలోకి తీసుకు వచ్చేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్తుంది. ఈ నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌పై విధంగా వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తుంది.

# భూములు లేని నిరుపేదలను రెచ్చగొట్టారు

### బీఆర్ఎస్ నేతల కనుసైగల్లో లగచర్లలో దాడులు

### ఉద్యోగులను భయభ్రాంతలకు గురిచేశారు

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం



భైంసా, (క్రైమ్ మిర్రర్): నిర్మల్ జిల్లా భైంసాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతల కనుసైగల్లో వారి స్వార్థం కోసం నిస్వార్థంతో పనిచేసే ఉద్యోగులను భయభ్రాంతలకు గురిచేశారని మండిపడ్డారు. వారి ఫోన్లో ఏమాట్లాడారో చూసామని, భూములు లేని నిరుపేదలను రెచ్చగొట్టారు.. కలెక్టర్‌ను చంపాలని రెచ్చగొట్టారని ఆయన ఆరోపించారు. పింక్ కలర్ అసలు నాయకుల పాత్ర ఉందో దాన్నంతా ప్రభుత్వం ఎక్స్ రే తీసినట్ట అంతా బయకు తీస్తదని ఆయన అన్నారు. తప్పు చేసిన వారిని వదిలిపెట్టదని, గత ప్రభుత్వ నాయకుల్లా కాదు.. ప్రతి పేదవాడికి ఇళ్లు ఇవ్వాలనేది మా ప్రభుత్వ చిత్తశుద్ధి అని ఆయన అన్నారు.సగం కట్టి వదిలేసిన ఇండ్లపై రివ్యూ చేస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి తీరుతామన్నారు మంత్రి పొంగులేటి. జనవరి నెల నుంచి తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి సన్న బియ్యం అందిస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా రైతు పండించిన ప్రతీ గింజ కొంటామన్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. అంతేకాకుండా%ొ% రైతుల కోసం అని కల్లాల బాట, మరో బాట అంటూ ఎవ్వరు పాదయాత్ర చేసి మోకాళ్లు అరగగొట్టుకోవాల్సిన పనిలేదని, డిసెంబర్ లోపు పక్కగా మిగిలిన రైతులకు రుణ మాఫీ చేస్తామని మంత్రి పోగులేటి హామీ ఇచ్చారు. మిగిలిన 13 వేల కోట్లు చెల్లిస్తామని, త్వరలో రైతు భరోసా ఒక కిస్తి చెల్లిస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు.

## ఎడిటోరియల్



# హైదరాబాద్, వేధిస్తున్న ట్రాఫిక్

### వర్షాకాలంలో వరదల్లా మారుతున్న రోడ్లు

### ఈ రెండు ప్రధాన సమస్యలపై ఫోకస్

### పక్కా ప్రణాళికకు సిద్ధం అవుతున్న సర్కార్




**వి**శ్వ నగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ ప్రధానంగా ట్రాఫిక్, వరదల సమస్యలను ఎదుర్కొంటోంది. నిత్యం ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా మారాయి. అలాగే వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికే రోడ్లు నదులను తలపిస్తున్నాయి. ఈ రెండు అంశాలపై రేవంత్ సర్కార్ తీవ్రంగా ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ట్రాఫిక్‌పై ఇప్పటికే చర్చ నడుస్తోంది. రోడ్లపైకి రోజూ వందలాదిగా కొత్త వాహనాలు రావడం కూడా తలనొప్పిగా మారింది. అలాగే ఇరుకు రోడ్లు కూడా ఇక్కట్ల పాటు చేస్తున్నాయి. ఈ క్రమంలో అవసరమైన చోట అండర్ పాస్‌లో, బ్రిడ్జిలు, రోడ్డు వెడల్పు వంటి కార్యక్రమాలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. దీనిని ట్రాఫిక్ పోలీస్ విభాగం పరిశీలిస్తోంది. యూటర్న్‌లు కూడా తీవక్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. తార్నాక యూ టర్న్ తొలగించాలని ఇటీవలే నిర్ణయించారు. అలాగే ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్ద కూడా యూటర్న్ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. దీనిని కూడా తొలగించాలని కోరుతున్నారు. ఇలా నగరంలో అనేక చోట్ల, ప్రధానంగా మెట్రోల వద్ద యూటర్న్‌లు ట్రాఫిక్ కష్టాలను పెంచుతున్నాయి. ఇకపోతే వరదనీరు నేరుగా మూసీలో కలవకుండా నాలాలన్నీ ఆక్రమణలకు గురయ్యాయి. ఇప్పటికే హైడ్రా వీటిని పరిశీలించి నివేదిక సిద్ధంచేసింది. ఈ క్రమంలో ఆక్రమణల తొలగింపు, నాలాల విస్తరణ వంటి చర్యలను తీసుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో వరద ముప్పు నుంచి హైదరాబాద్ మహా నగరాన్ని రక్షించేందుకు మహా ప్రణాళిక సిద్ధమవుతోంది. నగరంలో మూసీకి ఇరువైపులా 15 వరకూ చెరువులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. వరద నీటిని తొలుత ఈ చెరువుల్లోకి, అక్కడ నుంచి మూసీలోకి మళ్లించడం ద్వారా వరద ముప్పును ఎదుర్కోవచ్చనే అలోచనతో

ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఇప్పటికే అనేక చెరువులు కబ్జాకు గురయ్యాయి. ఉన్నవాటిల్లో పూడిక పేరుకుపోయింది. చెరువుల్లోకి కలిసే నాలాలూ పూడిపోయాయి. అందుకే చెరువుల ప్రస్తుత సామర్థ్యం, వాటి పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపైనా అధ్యయనం చేస్తున్నారు. చెరువులకు చేరిన నీరు మూసీలో కలిసేలా వ్యూహరచన చేస్తున్నారు. మూసీ సుందరీకరణ పథకానికి ఇది ఊతమిస్తుందని అధికార వర్గాలు తెలిపాయి. నగరపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ కార్యాచరణ ప్రణాళిక రూపొంది స్తోంది. 2050 అవసరాలను దృష్టిలో ఉంచుకొని వివిధ అంశాలపై రూపొందిస్తున్న మహా ప్రణాళికలో వరద మళ్లింపే కీలకమైనది. ఫిబ్రవరి నెలాఖరుకల్లా ఈ ప్రణాళిక సిద్ధం కానుందని సమాచారం. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉన్నట్లుండి ఒకేసారి కుండపోత వర్షం కురుస్తుండడంతో నగర రోడ్లు నదులను తలపిస్తు న్నాయి. వరదపోయే మార్గాలు మూసుకుపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గతంలో హైదారాబాద్,ఇటీవల విజయవాడలో జరిగిన వరద బీభత్సం తెలిసిందే. 2020 సంవత్సరంలో హైదరాబాద్ కూడా ఇలానే వరదలతో వణికిపోయింది. రాబోయే రోజుల్లో ఇలాంటి పరిస్థితులు మరింతగా ఉండే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో వరదల నుంచి హైదరాబాద్‌ను రక్షించేందుకు నగరపాలక పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. 2050 నాటికి అవుటర్ రింగు రోడ్డు పరిధిలో అభివృద్ధి చెందే నగరం అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూపొందిస్తున్న ఈ ప్రణాళికలో వరద మళ్లింపు కీలకమైనది. హైదరాబాద్‌లో ఇప్పుడున్న నాలా వ్యవస్థ రోజుకి 8 సెంటీమీటర్ల వర్షాన్ని మాత్రమే తట్టుకోగలదు. ఒక్క వర్షానికే హైదరాబాద్‌లోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అవుతున్నాయి. రోజుల తరబడి బురదతో జనం అల్లాడిపోయారు.



# బిఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ భూసేకరణ తీరు!

భూసేకరణ విషయంలో గత బిఆర్ఎస్ అనుపరించిన నిరంకుశ విధానాలనే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తోంది. రైతులను భూములు లేకుండా చేయడం సరికాదు. ఆరార్ ప్యాకేజీ ఇవ్వండ కాదు..భూమికి భూమి ఇవాలన్న నిబంధనలతో ముందుకు సాగాలి. అలాగే ప్రభుత్వ భూములు ఉన్న దగ్గర మాత్రమే పరిశ్రమలు పెట్టాలి. గతంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక సాగర్ భూసేకరణ అంతా బలవంతంగా సాగింది. రైతులను రోడ్డున పడేశారు. వారికి భూమి లేకుండా చేశారు. దీంతో రెండు నష్టాలు ప్రధానంగా జరుగనున్నాయి. ఒకటి వ్యవసాయం దెబ్బతినడంతో పాటు..రైతులు వారి కుటుంబాలు దిక్కూదివాణం లేకుండా పోతున్నాయి. బిఆర్ఎస్ హయాంలో ఇదే జరిగింది. రైతుల భూములు గుంజుకుని వారికి అరకొరగా ప్యాకేజీ ఇచ్చి రోడ్డున పడేశారు. అధికారులు బాగుపడ్డారు. లీడర్లు బాగుపడ్డారు. ఇళ్లూ, భూములు ఇచ్చిన రైతులు మాత్రం దిక్కులేని వారు అయ్యారు. పరిశ్రమలు, ప్రాజెక్టుల కోసం భూ సేకరణ జరిగిన ప్రతి ప్రాంతంలో ఇదే జరిగింది. వైఎస్ హయాంలో గంగవరం పోర్టు కోసం జాలర్లను బలవంతంగా ఖాళీ చేయించారు. పోర్టు వచ్చింది. వారి కుటుబాల్లో మాత్రం ఉద్యోగాలు రాలేదు. వారికి సక్రమమైన రీతిలో ఆర్‌ఆర్ ప్యాకేజీ రాలేదు. చివరకు గంగవరం పోర్టును ఆదానీ ఎగురేసుకు పోయారు. మచిలీపట్నం పోర్టు కావచ్చు..పోలవరం పరాజెక్టు కావచ్చు...మరే ఇతర ప్రాజెక్టు అయినా కావచ్చు..అలాగే జరిగింది. పోలవరం నిర్వాసితులకు ఇప్పటికీ కనీసం ఇల్లు కూడా సక్రమంగా కట్టి ఇవ్వలేదు. గుంజుకున్న భూములకు భూములు ఇవ్వలేదు. మల్లన్నసాగర్ రైతుల గతి కూడా అంతే అయ్యింది. ప్రజెక్టు వచ్చాక భూములు ఉన్నవారు, కొనుక్కున్న వారు బాగుపడ్డారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్ రోడ్డు...ఇలా చెప్పుకుంటూ పోతే... అనేక ఉదాహరణలు మన కళ్లకు కనబడుతున్నాయి. ఎక్కడా భూములు ఇచ్చిన వారు బాగపడలేదు. భూములు తీసుకున్న వారు, ఆ చుట్టుపక్కల కొనుక్కున్న వారు మాత్రమే బాగుపడ్డారు. ఇప్పుడు కూడా లగచర్లలో ఏర్పాటయ్యే ఫార్మా కంపెనీ ద్వారా కూడా అదే జరుగుతుంది. అందువల్ల భూసేకరణ పద్దతి మారాలి. అవసరం కోసం భూములు ఫార్మా పరిశ్రమలు పెట్టే వారే కొనుక్కోవాలి. ఫార్మకంపెనీలకు భూసేకరణ ద్వారా భూములు ఇవ్వడం కాకుండా వేలం పాట ద్వారా కావాల్సిన భూములు కొనుగోలు చేసుకునేలా చేయాలి. కంపెనీలు పెట్టాలనుకునే వారు భూములు కొనుక్కునేలా చేయాలి. ఇకపోతే భూములన్నీ పరిశ్రమలకు కేటాయిస్తూ పోతే వ్యవసాయం దెబ్బతింటుందని గుర్తించాలి. రైతులను వ్యవసాయం చేసి, మనకు అసవరమైన ఆహారధాన్యలు పండించేలా ప్రోత్సహించాలి. మనదేశం నూనెల కోసం ఇతర దేశాలపై ఆధారపడుతోంది. దానినుండి బయటపడేందుకు మన భూమల్లో నూనెగింజలు పండించేలా రైతులను ప్రోత్సహిస్తే బంగారం పండుతుంది. వేరుశనగ, నువ్వులు, పొద్దు తిరుగుడు పంటలు పుష్కలంగా మన నేలల్లో పండుతాయి. ఈ పంటలను ప్రోత్సహిస్తే..అవసరాలు తీరడంతో పాటు, రైతులు ఆర్థికంగా బలోపేతం అవుతారు. వ్యవసాయాధారిత కుటీర పరిశ్రమలతో నిరుద్యోగులకు ఉపాధి కల్పించ వచ్చు. ఉపాధి, ఉద్యోగాలకు పరిశ్రమలే రావాల్సిన అవసరం లేదు. వ్యవసాయం, అనుబంధ రంగాలను ప్రోత్సహిస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కాగలదు. నిరుద్యోగ సమస్య తీరగలదు. లగచర్ల విషయానికి వస్తే రైతులను సంప్రదించాలి. అఖిలపక్షంలో చర్చించాలి. అసలు ఫార్మా అవసరమా లేదా అన్నది కూడా విస్తృతంగా చర్చించాలి. ఇప్పటికే కాలుష్యంతో చస్తున్నాం. ఈ ఫార్మా కంపెనీతో కాలుష్యం పెరుగుతుంది. అందువల్ల బిఆర్ఎస్ అనుసరించిన నిరంకుశ విధానాలను రేవంత్ సర్కార్ విడనాడాలి. రైతులను రోడ్డున పడేసే కార్యక్రమాలను పక్కన పెట్టాలి. జీవనాధారమైన భూములు లాక్కొని అభివృద్ధి చేస్తామంటే...

నమ్మడానికి లేదు. భూములు ఇచ్చిన రైతులు కుటుంబంతో ఎక్కడికి పోవాలి? ఎలా బతకాలి? అన్నది కూడా ఆలోచన చేయాలి. మమ్మల్ని చంపినా మా భూములివ్వం... ఇంచుభూమిని కూడా వదులుకోం అని లగచర్లతోపాటు సమీపంలోని పెచ్చెర్లగడ్డ తండా, ఆర్బీ తండా బాధిత రైతు కుటుంబాలు మొత్తుకుంటున్న వేళ, పాలకులు వారి గురించి ముందు ఆలోచించాలి. మీడియా ముందుకు వచ్చిన వారి గోడును వినాలి. వారి భూములు తీసుకోవాల్సి వస్తే..భూమికి భూమి ఇవ్వాలి. అలాగే ఇల్లుకు ఇల్లు ఇవ్వాలి. దాంతో పాటే పరిహారం కూడా ఇవ్వాలి. అల ఇవ్వడానికి వారిని ఒప్పించాలి. అంతేగాని బలవంతంగా భూసేకరణ సరికాదు. మా ఇండ్ల వద్దకొచ్చి.. మీ భూములు ఇచ్చేయండి, ఫార్మా కంపెనీ పెడుతున్నమని చెప్తున్నారు. సర్వేల పేరుతో రోజూ మా ఇండ్ల చుట్టూ తిరుగుతున్నరు. అధికారులు కూడా మా భూములు తీసుకుంటా మని బెదిరిస్తున్నరు. మాకు ఫార్మా కంపెనీ అక్కర్లేదు.. కంపెనీ పెడితే మా భూములు నాశమవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతుల బాధలను ఆలోచించాలి. ఉన్న భూములను సర్కారు లాక్కుంటే తామెలా బతకాలని బాధితులంతా గోడు వెళ్లబోసుకున్నారు. తమ ప్రాణాలు పోయినా భూములు ఇవ్వబోమని తేల్చి చెప్పారు. నోటీసులు కూడా ఇవ్వలేదని స్పష్టంగా చెప్తున్నారు.. ఫార్మా ఎందుకు పెడుతున్నారో చెప్పలేదని వారు తెలిపారు. 9 నెలలుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని బాధితులే అంటున్నారు.

ఈ ఫార్మా సిటీ వల్ల మాకున్న భూమి, ఇల్లుతో సహా సర్వం పోతుందని వాపోతున్నారు. పుట్టిన నాటి నుంచి ఈ భూములతో మాకు అనుబంధం ఉంది. ఒక్కసారిగా భూములు ప్రభుత్వానికి అప్పజెప్పాలని అంటే మేం ఎక్కడికి వెళ్లాలి, ఎలా బతకాలని వారు వేస్తున్న ప్రశ్నలకు నేరుగా సిఎం రేవంత్ రెడ్డి, అధికారులు సమాధానం ఇవ్వాలి. మాకున్న పొలమే మాకు జీవనాధారం. ఫార్మా కంపెనీ కోసం మా పొలాలు కావాలని అడగడం సరికాదు. నోటికాడి కూడును లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉన్న భూమి పోతే ఎలా బతకాలి? అధికారులొచ్చి ఫార్మా కంపెనీకి భూములియ్యమంటున్నారు. మీకు మా భూములే దొరికాయా. ఉన్న భూములు ఇచ్చేసి మేమెలా బతకాలి? అలాగని మా భూములు తీసుకుంటామంటే అస్సలు ఊరుకునేది లేదు. జానెడు భూమికి కొట్టుకుసచ్చే రోజులివి. నాకున్న భూమి మొత్తం ఇవ్వమంటే ఎలా? అంటూ ఒక్కో కుటుంబం ఒక్కో గాధ వినిపిస్తోంది. నిజంగానే ఇది కన్నీటి వ్యథ. దీనిని అంతా ఆలోచించాలి. ప్రభుత్వమే తన విధానాలను మార్చుకోవాలి. రైతులను వేధించి భూములు తీసుకోవడం సిరికాదు. ఆర్‌ఆర్ ప్యాకేజీలు భూమికి భూమి, ఇంటికి ఇల్లు అన్న పద్దతిలో ముందుకు రావాలి. లేదా భూములను అమ్ముకునే రైతుల నుంచి మాత్రమే సేకరించాలి. లేదా ప్రభుత్వ భూముల్లో మాత్రమే పరిశ్రమలు పెట్టాలి. అలా కాకుండా రైతుల భూములను గుంజుకుని పరిశ్రమలు పెడతామంటే కుదరదు. ప్రభుత్వ భూములను అమ్ముకుంటూ పోవడం వల్లనే ఇప్పుడీ దుస్థితి వచ్చిందన్నది కూడా గుర్తించాలి.



## కాంగ్రెస్ విజయోత్సవ వేడుకలకురంగం సిద్ధం

### ఏడాది పాలనపై ఫోకస్ పెట్టేలా కార్యక్రమాలు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకుంటున్న క్రమంలో విజయోత్సవాలు ఘనంగా నిర్వహించబోతున్నారు. ఏడాలిలో ప్రభుత్వం సాధించిన విజయాలు, చేపట్టిన కార్యక్రమాలు తదితరాలను ఫోకస్ చేస్తూ కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. డిసెంబర్ 7వ తేదీకి రేవంత్ సర్కారు ఏర్పడి ఏడాది కావొస్తున్న నేపథ్యంలో.. ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణంలో ప్రజా పాలన విజయోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించింది ప్రభుత్వం. ఈమేరకు ప్రజాపాలన- విజయోత్సవాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష చేశారు. ప్రజాపాలన-విజయోత్సవాల్లో శాఖలవారీగా, విభాగాల వారీగా ప్రభుత్వం తొలి ఏడాదిలో సాధించిన విజయాలను, చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం ఆదేశించారు. ఈసందర్భంగా డిసెంబర్ 9 వరకు ప్రజాపాలన విజయోత్సవాలపై చేపట్టే కార్యక్రమాలను సీఎంకు అధికారులు వివరించారు. ఈ నెల 19న వరంగల్ వేదికగా.. 22 జిల్లాల్లో ఇందిరా మహిళాశక్తి భవనాలకు శంకుస్థాపన చేస్తారు. విజయోత్సవాల్లో భాగంగా వరంగల్, కరీంనగర్.. మహబూబ్‌నగర్ జిల్లాల్లో సీఎం రేవంత్ బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు.



### ఉభయ తెలుగు రాష్ట్రాల్లో

# కార్తీక పౌర్ణమి శోభ

**కా**ర్తీక పౌర్ణమి పర్వదినంతో ప్రముఖ ఆలయాలకు, నదీతీరాలకు భక్తులు పోటెత్తారు. కార్తిక పౌర్ణమి సందర్భంగా శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాన్నాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. సముద్ర, నదీతీరాల్లో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. వేకవ జామునే నదీతీర ప్రాంతాల్లో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. అటు శైవాలయాలు, ఇటు వైష్ణవాలయాలు కిటకిటలాడాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆధ్యాత్మిక శోభన సంతరించుకుంది, తెల్లవారుజాము నుంచే గోదావరి స్నానాలకు, శివాలయాలకు పోటెత్తారు భక్తులు. రాజమండ్రి పుష్కర్ ఘాట్ వద్ద గోదావరి పుణ్యస్నానా కోసం జల్లు స్నానాలను ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్తీక శుద్ధ పౌర్ణమి లేదా కార్తీక పున్నమి గా పిలవబడే కార్తీకమాసంలో శుక్లపక్షంలో పున్నమి తిథి దీపావళి పండగ వెళ్ళిన 15వ రోజు వస్తుంది. హిందువులు అత్యంత పరమ పవిత్రమైన కార్తీక మాసంలోని పౌర్ణమి తిథి కావడంతో శివాలయాలకు , శైవ వక్షేత్రాలైన ద్రాక్షారామం, సామర్లకోట, పిఠాపురం పాదగయ, కోనసీమలో పలు పుణ్యక్షేత్రాలకు చేరుకుని పెద్ద ఎత్తున దీపాలు వెలిగించారు, మహాభారత కథనాన్ని అనుసరించి కార్తీకేయుడు తారకరుని సంహరించిన రోజునే కార్తీక పౌర్ణంగా పిలుస్తారని పురాణాలు చెబుతున్నాయి. మహాశివరాత్రి తర్వాత శివుడికి అత్యంత ప్రీతికరమైన రోజుగా కార్తీకమాసం అంటారు. కార్తీక పౌర్ణమి రోజున చేసే నదీ స్నానం దీప దానం, శివాయల దర్శనం, విశేష పూజలు చేస్తే ఎంతో పుణ్యం ఫలమని నమ్మకం. ఈ నెల అంతా కార్తీక మహా పురాణాన్ని పారాయణం చేస్తారు. దేవాలయాలో కార్తీక పురాణ శ్రవణం ఏర్పాటు చేస్తే ఎంతో పుణ్యఫలం అని బ్రాహ్మణులు చెబుతున్నారు, వెయ్యిళ్ల రాక్షసుల పాలన అంతరించిన సందర్భంగా మహాశివుడు తాండవం చేశాడని పురాణాలు కూడా చెబుతున్నాయి. అందుకే కార్తీక పౌర్ణమి రోజు గోదావరి స్నానం నదీ స్నానమాచరించి శివుడికి ప్రత్యేక పూజలు చేయడానికి ఆలయాలకు క్యూ కట్టారు భక్తులు. శివాలయంలో 365 ఒత్తులతో కూడిన దీపాన్ని వెలిగిస్తే పుణ్యఫలం దక్కుతుందని నమ్మకం. దీంతో గోదావరి జిల్లాల్లోని ఆధ్యాత్మిక కేంద్రాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఇకపోతే విజయవాడ కృష్ణాఘాట్, విశాఖ బీచ్, శ్రీశైలం,శ్రీకాళహస్తి, తిరుపతిల్లో లక్షవల్లుతు వెలగించారు. స్వామికి అభిషేకాలు చేయించారు.

# కార్తీక పౌర్ణమి ప్రతి ఇంట్లో వెలుగులు నింపాలి...!

## అనంత పద్మనాభ స్వామికి ఎమ్మెల్యే కాలే యాదయ్య దంపతులు ప్రత్యేక పూజలు...!!

## సమాజాన్ని పీడించే రుగ్మతలు తొలగి సుభిక్షంగా ఉండాలి...!!

## చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య...!



**క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీ అనంత పద్మనాభ స్వామిని చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య జయమ్మ దంపతులు దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే కాలే యాదయ్యను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా ప్రజలందరికి కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆశీర్వచనం అందరిపై ఉండాలని ప్రజలంతా ఆయు ఆరోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఈ కార్తీక పౌర్ణమి ప్రతి ఇంట్లో వెలుగులు నింపాలని, రాష్ట్రంలో సమాజాన్ని పీడించే రుగ్మతలు తొలగి సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. అనంత పద్మనాభ స్వామి భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రానికి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అనంత పద్మనాభ స్వామిని దర్శించుకున్న వారిలో నాయకులు,తదితరులు ఉన్నారు.

## అల్కాపూర్లో వ్యక్తి దారుణ హత్య



**గండిపేట్(క్రైం మిర్రర్):** గుర్తు తెలియని దుండగుల దాడిలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అల్కాపూర్ టౌన్షిప్లోని రోడ్ నెంబర్ 30లో నిర్మాణంలో ఉన్న అపార్ట్మెంట్లో ఓ వ్యక్త రక్తస్రావమైన గాయలతో పడి ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి చూడగా ఎవరో అతడి ముఖం, తలపై గాయపరిచిన ఆనవాలు కనిపించాయన్నారు. వెంటనే 108 సహాయంతో బాధితుడిని ఉస్మానియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించామన్నారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడు బాలానగర్ ప్రాంతానికి చెందిన రోహిత్సింగ్(25)గా గుర్తించామన్నారు. మృతికి గల కారణాలపై విచారణ జరిపిస్తున్నామని హత్యకు గల కారణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు.

## మణికొండ మున్సిపాలిటీకి చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణి చేసిన ఎమ్మెల్యే ప్రకాష్గౌడ్



**గండిపేట్(క్రైం మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తున్నానని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్గౌడ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీకి చెందిన బాధితులు ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చేరగా వారి వైద్య ఖర్చుల కోసం మణికొండ వాసులు రామకృష్ణాకు 44 వేలు, చిత్రపురికి చెందిన రాంమోహన్కు 44 వేలు, పుప్పాలగూడకు చెందిన యాదమ్మకు 44 వేల రూపాయల చెక్కులను ఆయన పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సీఎం సహాయ నిధి పేదలకు వరంగా మారాయన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, శ్రీరాములు, గుట్టమీద నరేందర్, నార్సింగి మార్కెట్ కమిటీ మెంబర్ ఏర్పుల కుమార్, శ్రవణ్ కుమార్,గంగాధర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్యారీ బ్యాగుల తయారీ కంపెనీ ప్రారంభించిన ఎమ్మెల్యే వేముల వీరేశం



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల పట్టణంలో ఆర్కే ఎంటర్ ప్రైసెస్ పర్యావరణానికి హానికాకుండా ప్రకృతిలో కలిసే బ్యాగులను తయారు చేసే కంపెనీని శుక్రవారం నాడు నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ప్రారంభించడం జరిగింది. అనంతరం మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత కంపెనీ ఏర్పాటు చేసిన గందూరి శిరీష రామకృష్ణను అభినందించారు ఈరోజు పర్యావరణం ప్లాస్టిక్ తో కలుషితం అవ్వడం జరుగుతుంది. పర్యావరణాన్ని కాపాడాలని మంచి ఉద్దేశంతో ప్లాస్టిక్ రహిత బ్యాగులు పర్యావరణానికి హానికాకుండా త్వరితగతిన ప్రకృతిలో కలిసే విధంగా బ్యాగులు తయారు చేయడం ఎలాంటి విష పదార్థాలు ఉండకుండా పర్యావరణానికి తోడ్పడే ఈ కంపెనీ ఏర్పాటు చేయడం మంచి సదుద్దేశమని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి,మాజీ ఎంపీ చైర్మన్ కాటం వెంకన్న,నాయకులు దుబ్బాక అమరేందర్ రెడ్డి (ఎన్నారై) కౌన్సిలర్లు బెల్లి సత్తయ్య,రెమిడాల లింగస్వామి, జడల చిన్న మల్లయ్య,ఏర్పుల పరమేష్, కోసనం అశోక్ ,ఎద్దులపురి కృష్ణ,బోడ స్వామి,ఎడ్ల మహాలింగం తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-3 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

### అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్.



**భద్రాద్రి కొత్తగూడెం నవంబర్ 15 (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్-3 పరీక్షలు ఈ నెల 17, 18 తేదీల్లో జిల్లాలోని 39 కేంద్రాల్లో జరుగుతాయని జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ తెలిపారు. 13478 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారన్నారు. అభ్యర్థులు సకాలంలో చేరాలని, సెల్ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, లాగ్ టేబుల్స్, బ్యాగులు నిషేధమని చెప్పారు. బయోమెట్రిక్ విధానం కారణంగా మెహందీ, టాటూలు పెట్టకుండా ఉండాలని సూచించారు.




## భద్రాచలం పట్టణ రజక వృత్తిదారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**భద్రాద్రి కొత్తగూడెం నవంబర్ 15 (క్రైమ్ మిర్రర్):** భద్రాచల పట్టణ రజక వృత్తిదారుల సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకోబడింది. భద్రాచలం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిదులుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు ముదిగొండ రాంబాబు, కార్యదర్శి చిటికెన ముసలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా భద్రాచల పట్టణ పాత కమిటీ రద్దు చేసి, 15 మంది సభ్యులతో కొత్త కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. భద్రాచల పట్టణ రజక వృత్తిదారుల సంఘం నూతన అధ్యక్షులుగా గుడిపల్లి లక్ష్మణ్, కార్యదర్శులుగా రాజమండ్రి వెంకటేశ్వర్లు ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శిగా గద్దం సాంబశివ( సోషల్ మీడియా ఇంచార్జ్ )గా,నూతన కమిటీని నియమించారు. ఈ సమావేశం లో రజకులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో పాత సొసైటీలు పునరుద్ధరణ కొత్త సొసైటీలను నిర్మాణం, రజకులకు పది లక్షల రుణాలు , ప్రతి రజకుడికి 50 సంవత్సరాలు నిండితే ఆసరా పెన్షన్ ఇవ్వాలని,మోడ్రన్ ధోబి గార్డ్ నిర్మాణాలకు స్థలం కేటాయించి కట్టించాలని, ప్రభుత్వ దేవస్థానాలలో గురుకుల పాఠశాలలో ప్రభుత్వ ఆసుపత్రిలో రజకులు చేసే పని రజకులకు కేటాయించాలని, రజకులపై దాడులు దౌర్జన్యాలు జరుగుతున్నవి వీటిని అరికట్టానికి రక్షణ చట్టం కల్పించాలని చర్చించారు.

## సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వేగవంతం చేయాలి

### మణికొండ మున్సిపల్ కమీషనర్ ప్రదీప్కుమార్



**గండిపేట్(క్రైం మిర్రర్):** ప్రజలు సమగ్ర సర్వేకు వచ్చే సిబ్బందికి తమ పూర్తి వివరాలను వెల్లడించేలా అవగాహన పెంచాలని మణికొండ మున్సిపల్ కమీషనర్ ప్రదీప్కుమార్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)పై ఎన్యుమరేషన్ ప్రక్రియ గురించి సంబంధిత సూపర్వైజరకలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అదే విధంగా ఎన్యుమరేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూపర్వైజర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కార్తిక పౌర్ణమి వేడుకలు



**నిజాంపేట్, క్రైమ్ మిర్రర్:** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ పరిధిలోని శ్రీ మహాగణపతి ఆలయం వద్ద స్థానిక కార్పొరేటర్ చిట్ల దివాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుండి ఆలయం వద్ద మహిళలు పెద్ద ఎత్తున చేరుకొని కార్తీక పౌర్ణమి పర్వదిన సందర్భంగా ఆలయం వద్ద దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ పూజారి సూరారం సందీప్ శర్మచే శ్రీ మహాగణపతి పంచామృతాభిషేకం, శ్రీ మహా శివుడికి లింగానికి అభిషేకము తోపాటు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు దేవాలయాన్ని పూలతో అలంకరించి 516 దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మహాగణపతి ఉత్సవ కమిటీ సభ్యులు బొట్ల తిరుపతి, శరత్ రెడ్డి, ధార్కోల్ శ్రీనివాసరావు, సందీప్, విజయభాస్కర్ రెడ్డి, రాంపుల్లారెడ్డి, గణపతి రావు, వేణు, రమేష్, సాయి సుబ్బారావు, తోట శ్రీకాంత్, క్రాంతి, శ్రీనివాసరావు, పద్మా గౌడ్, బోట్ల సుజాత, జ్యోతి శరణ్య, సునీత శ్రీనివాస్ రెడ్డి, వేముల రజనీ మని, తోట రాజేశ్వరి, జయంతి, శారద, డివిజన్ ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు రంగారెడ్డి జిల్లా పద్మశాలి కుల బంధవుల సమావేశం







**గండిపేట్(క్రైం మిర్రర్):** రంగారెడ్డి జిల్లా పద్మశాలి కుల బంధవుల సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు శ్రీ మార్కండేయ పద్మశాలి ట్రస్ట్ మాజీ అధ్యక్షులు కాశిగారి యాదగిరి, రంగారెడ్డి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఏర్వ సత్యనారాయణలు తెలిపారు. ఈ నెల 16వ తేదీన రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్దేవ్పల్లి డివిజన్ లోని భావన ఋషి నగర్లోని శ్రీ మార్కండేయ పద్మశాలి ట్రస్ట్ భవనంలో ఉదయం 10 గంటలకు రంగారెడ్డి జిల్లా పద్మశాలి కుల బంధవుల సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక, ప్రమాణ స్వీకారోత్సవం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గోస్కి యాదగిరి, మేడం బాబురావు, వేముల బాలరాజు, రాపోలు వీరమోహన్, వేముల వెంకన్న, సీత వైద్య కిషోర్లు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరిస్తారన్నారు. కార్యవర్గాన్ని పూర్తిస్థాయిలో ప్రకటన చేసుకోని రంగారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం పటిష్టతకు అందరూ సహకరించాలన్నారు. ఈ సమావేశంలో కులస్తులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# ఘనంగా భగవాన్ బిస్రా ముండా జయంతి వేడుకలు

## పేసా చట్టాల ప్రకారమే గ్రామసభ నిర్ణయాలు ఆమోదం

## ఎంపీడీవో బయ్యారపు అశోక్



**భద్రాద్రి కొత్తగూడెం నవంబర్ 15 (క్రైమ్ మిర్రర్ ):** ఏజెన్సీ చట్టాలను పగడ్బందీగా అమలు చేయడంలో గ్రామ సభల్లో నిర్ణయాల ఆమోదంకు పెసా చెట్టం ప్రకారమే అమలు అవుతున్నాయని ఎంపీడీవో బయ్యారపు అశోక్ అన్నారు. శుక్రవారం భగవాన్ బిస్రా ముండా 150వ జయంతిని పురస్కరించుకొని చంద్రుగొండ మండల వ్యాప్తంగా ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. చంద్రుగొండ గ్రామపంచాయతీలో జరిగిన గ్రామసభ, జయంతి, వేడుకల్లో ఎంపీడీవో బయ్యారపు అశోక్ పాల్గొని భగవాన్ బిస్రా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అలాగే పంచాయతీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటి, గ్రామ సభకు వచ్చిన వారందరితో పెసా చట్టాలు అమలు, వ్యక్తిగత పరిశుభ్రత, ప్రతి ఒక్కరు స్వచ్ఛ భారత్ లో పాల్గొనాలని, నేటి యువత మాదికద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరు పాటు పడాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. భగవాన్ బిస్రా ముండా జయంతిని పునస్కరించుకొని దేశవ్యాప్తంగా జనజాతీయ గౌరవదీవస్ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామపంచాయతీలో గ్రామసభలు నిర్వహించి. గిరిజనుల చట్టాలపై అవగాహన కల్పించి. ప్రభుత్వ పలాలు వారికి అందేలా ప్రణాళికలు రూపొందించడం ఈ గ్రామ సభల ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ సందర్భంగా ఇద్దరు వృద్ధులకు శాలువాలతో సత్కరించారు. అనంతరం గ్రామసభకు వచ్చిన సభ్యులందరూ కలిసి జాతీయ గీతం ఆలపించి గ్రామసభను ముగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి రాజేందర్, కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు మాలోత్ బోజ్యా నాయక్, నల్లమోతు రమణ, సయ్యద్ రసూల్, ఫజల్ బక్షి, గాదె శివప్రసాద్, పుల్లయ్య , బుంగ శీను, గ్రామ పెద్దలు పెద్దిని వేణు, ఏఎన్ఎంలు, అంగన్వాడి టీచర్లు, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.



# మణికొండలో ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలి

**మణికొండ మున్సిపాలిటీ కమీషనర్ ప్రదీప్‌కుమార్**

**గండిపేట్(క్రైం మిర్రర్):** సమగ్ర ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలని మణికొండ మున్సిపాలిటీ కమీషనర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిదిలోని 6వ వార్డులోని బాయూత్ కాలనీ, ఖిజ్రా ఎంక్లూవ్, 7వ వార్డులోని వైఎస్సార్ కాలనీ, 8వ వార్డులోని అల్కాపూర్ టౌన్‌షిప్‌లలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఎన్యుమరేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సిఇపెక్ సర్వేకి ప్రజలందరూ సహకరించాలని ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్, ఏఈఈ సంజయ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు కరెండు ఉండని ప్రాంతాలు

గండిపేట్(క్రైం మిర్రర్): మరమ్మత్తుల కారణంగా పలు విద్యుత్ సబే స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ఏఈ వి.మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. నార్సింగి-1 సబ్ స్టేషన్ 11కేవీ బృందావన్ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1 గంట నుంచి 1.30 వరకు బృందావన్ కాలనీ తదితర ప్రాంతాల్లో, మార్కెట్ యార్డ్ సబ్‌స్టేషన్ వివేకానంద ఫీడర్ పరిధిలో 12 గంటల నుంచి 12.30 వరకు నార్సింగి గ్రామం, నార్సింగి హైట్స్, కుబా కాలనీ, ఓస్వా కాలనీ, వివేకానందనగర్, కోకాపేట్ సబ్‌స్టేషన్ బాబుఖాన్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు 250 యార్డ్ గోల్డెన్ మైల్, బాబుఖాన్ విల్లాస్, గ్రాడ్ ఇన్ఫ్రా టెక్ విల్లాస్, దంతు స్ట్రీట్, వట్టినాగులపల్లి సబ్‌స్టేషన్ జీఎంఆర్ ఖానాపూర్ ఫీడర్ పరిధిలో 12.30 నుంచి ఒంటి గంట వరకు ఖానాపూర్ గ్రామం, ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు, శ్రీదేవి ఫీడర్ పరిధిలో 11.30 నుంచి 12 గంటల వరకు కోకాపేట్, కోకాపేట్-1, కృష్ణా గోసేవ, వట్టినాగులపల్లి, వివేకానందనగర్, వట్టినాగులపల్లి ఫీడర్ పరిధిలో 11 గంటల నుంచి 11.30 వరకు వట్టినాగులపల్లి, వివేకానందనగర్, ఇబ్రహీంబాగ్ సబ్జస్టేషన్ మిలట్రీ-1 పీడర్లో 12 గంటల నుంచి 12.30 వరకు రాందేవూడ, వన్మోర్ నగర్ కాలనీ, నెక్నాంపూర్మం తదితర ప్రాంతాల్లో ఈ కోత ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

## బాలల దినోత్సవంలో సత్తాచాటి బహుమతులు సాధించిన శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు



**గండిపేట్(క్రైం మిర్రర్):** విద్యార్థుల లక్ష్యసాధనకు నిరంతరం కష్టపడి చదవాలని శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకోని తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్వహించిన పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పాటల పోటీల్లో ఎన్.నరేష్(8వ తరగతి), చిత్రలేఖనంంలో డి.విఘ్నేష్, కథల పోటీల్లో టి.యశ్వీత(8వ తరగతి), ఉపన్యాస పోటీల్లో ఉత్తమ ప్రతిభకనబరిచి బహుమతులు పొందారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# తిప్పాపురం పంచాయతీలో ఘనంగా బీర్సా ముండా జయంతి వేడుకలు



**భద్రాద్రి కొత్తగూడెం నవంబర్ 15 (క్రైమ్ మిర్రర్ ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తిప్పాపురం గ్రామపంచాయతీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చెర్ల మండల జి. పి ప్రత్యేక అధికారి ఎంపీడీవో ఈదయ్య అధ్యయనుసారంతో తిప్పాపురం గ్రామ పంచాయతీ సెక్రటరీ రఫీ ఆధ్వర్యంలో ఆదివాసీ గ్రామాల్లో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన విప్లవ వీరుడు స్వతంత్ర సమరయోధుడు బిర్సా ముండా జయంతిని పురష్కరించుకొని గిరిజన ఆత్మగౌరవ దినోత్సవం గా నిర్వహించడం జరుగుతుందని గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలకు ఎదురోడ్డు పోరాడిన ఆదివాసి ముద్దుబిడ్డ బీర్సా ముండా అని, గిరిజనులను చైతన్య పరిచి భారత స్వాతంత్ర పోరాటంలో పాల్గొనేలా చేసి సమ సమాజ పోరాటం, ఆర్థిక జీవన విధానాలు ఎదుగుదల కొరకు విశ్రమించకుండా బ్రిటిష్ వారిని ఎదిరించి మనకు హక్కులు కల్పించిన మహోన్నత వ్యక్తి అని ఆయన అన్నారు. గిరిజన హక్కుల కోసం మన్యం దొర అల్లూరి సీతారామరాజు, కోమరం భీమ్, బీర్సా ముండా వంటి మహనీయులు పోరాటం ఫలితంగా రాజ్యాంగంలో మనకు హక్కులు కల్పించడం జరిగింది. 1/70 చట్టం, పీసా చట్టం రాజ్యాంగం లో పొందుపరచడం వలన, నీళ్లు నిధులు నియామకాలు అందే విధంగా ఆదివాసి గిరిజనులకు ప్రత్యేకంగా రిజర్వేషన్ కల్పించడం జరిగిందని, ఆదివాసి గ్రామాలు విద్య పరంగా అభివృద్ధి చెందడానికి కొత్త ఉపాధ్యాయ పోస్టులు 11064 గిరిజనులకే కేటాయించడం జరిగిందని వచ్చిన అవకాశాలను ఆదివాసి గిరిజనులు అందిపుచ్చుకొని ముందుకు పోవాలని అన్నారు.ఐటీడీఏ పరిధిలో ఉన్న ప్రజలకు గిరిజనులకు సేవలు అందించడానికి జిల్లా కలెక్టర్ తో పాటు ప్రాజెక్టు అధికారులు ఉత్సాహం చూపిస్తున్నారని అందుకు ప్రజలు గిరిజనులు విద్యా వ్యవసాయం పరంగా ముందుకు పోవాలని, ఐటీడీఏ ద్వారా లభించే పథకాలు అర్హులైన ప్రతి గిరిజనులకు అభివృద్ధి దశగా అందిస్తున్నారని తెలిపారు.తిప్పాపురం గ్రామంలోని ఆదివాసి పెద్దలకి డబ్బా చిన్నబ్బి, గట్టుపల్లి సింగయ్య, ఇరువురికి ఏర్పాటు చేసినటువంటి గ్రామ సభలో శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిప్పాపురం, బత్తెనపల్లి, గోర్కొండ, రాళ్లపురం, గ్రామస్తులు పాల్గొన్నారు.





## రాంబాగ్‌లో ప్రారంభమైన కుస్తీ పోటీలు

**గండిపేట్(క్రైం మిర్రర్):** సర్దార్ వల్లభాయ్ పటేల్ కేసరి కుస్తీ పోటీలు అత్తాపూర్ డివిజన్ రాంబాగ్ మైదానం కేంద్రంగా శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైయ్యాయి. ఈ 6వ కుస్తీ పోటీలను రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కుస్తీ పోటీలలో హైదరాబాద్ నగరంలో నలుమూలల నుంచి రెజ్లర్లు పాల్గొన్నారు. కుస్తీ పోటీల కమిటి చైర్మన్, బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జీ ఎన్.మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.రాజు పైల్వాన్‌ల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహ్మారెడ్డి, సీనియర్ నాయకులు వై.శ్రీధర్, కొమురయ్య, మల్లేష్‌యాదవ్, విజయ్‌కుమార్, నల్లింగ్ రమేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొలన్ సుభాష్‌రెడ్డి, అత్తాపూర్ సీఐ వెంకటరామిరెడ్డి, సీనియర్ జర్నలిస్టు మేడం మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు.

# నేతకానిలను చిన్నచూపు చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**నేతకాని హక్కుల పోరాట సమితి రాష్ట్ర యువజన అధ్యక్షుడు దూగుట వెంకటేష్**



**మంచిర్యాల ప్రతినిది(క్రైమ్ మిర్రర్):** తెలంగాణలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం నేతకానీలను చిన్నచూపు చూస్తున్నారని యువజన అధ్యక్షుడు దుగుట వెంకటేష్ విలేకరుల సమావేశంలో ఆరోపించారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో రెండు లక్షల 20 వేల మంది నేతకానిలు అలాగే తెలంగాణ వ్యాప్తంగా 18 లక్షల నేతకానీలు ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇంత మేర నేతకానీలు ఉన్నా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నేతకానిలను పట్టించుకున్న పాపాన పోలేదు అన్నారు. గతంలో తెరాస 2009, బీజేపీ 2018 సంవత్సరంలో గోమాస శ్రీనివాస్ కు ఎమ్మెల్యే,2023లో బీజేపీ ఎంపీ టికెట్లు కేటాయించి గౌరవించిదన్నారు. అదేవిధంగా తెరాస 2009,2014, 2019, 2023లలో దుర్గం చిన్నయ్యకు ఎమ్మెల్యే టికెట్ ను కేటాయించింది అన్నారు. కానీ నేతకానిలను చిన్నచూపు చూస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే అని నేతకాని హక్కుల పోరాట సమితి యువజన అధ్యక్షుడు దూగుట వెంకటేష్ అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నేతకానిలను పట్టించుకున్న పాపాన పోలేదు అన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికలలో కూడా నేతకాలను ప్రాధాన్యం ఇవ్వనట్లయితే నేతకాల్లో ఆగ్రహం కాంగ్రెస్ ప్రభుత్వం రుచి చూడవలసి వస్తుంది అని అన్నారు. లేనియెడల నేతకానిలందరూ టిఆర్ఎస్ వైపు చూసే అవకాశం ఉంది అని తెలిపారు.ఇదే నిజమైతే రానున్న స్థానిక సంస్థ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని తెలిపారు. గత ప్రభుత్వం నేతకానిలను గుర్తించింది కానీ.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రానున్న స్థానిక సంస్థ ఎన్నికలలో కూడా నేతకాలను విస్మరించినట్లయితే నేతకానిల ఆగ్రహం కాంగ్రెస్ ప్రభుత్వం రుచి చూడవలసి వస్తుందని హెచ్చరించారు.

# కన్న తల్లిని రోకలితో కొట్టి చంపిన కసాయి..!

## వికారాబాద్ జిల్లా,యలాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన...!



**క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఓ కసాయి కొడుకు తన సొంత తల్లిని ఇంట్లో ఉన్న రోకలితో కొట్టి చంపాడు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా, యలాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని జక్కేపల్లి గ్రామానికి చెందిన చంద్రమ్మ తన కుమారుడు వెంకటప్పతో కలిసి ఉంటోంది. కుమారుడు వెంకటప్ప ఏ పని చేయకుండా గ్రామంలో జులాయిగా తిరుగుతుంటాడు. తల్లి దగ్గర డబ్బులు తీసుకొని మద్యం తాగుతూ ఉంటాడు. వెంకటప్ప భార్య సునీత భర్తతో వేగలేక తన తల్లి ఊరు హాజీపూర్ వెళ్లి అక్కడే ఉంటోంది.రెండు రోజుల క్రితం మద్యం కోసం తల్లిని రోకలిబండతో చిదకబాదాడు. దీంతో గాయాలపాలైన తల్లిని వెంకటప్ప ఆసుపత్రికి కూడా తీసుకెళ్లకపోవడంతోపాటు ఎలాంటి వైద్యం అందించలేదు. కనీసం తాగడానికి నీళ్లు కూడా ఇవ్వని క్రమంలో ఆమె శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు కోడలికి సమాచారం అందించడంతో ఆమె పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని తాండూర్ జిల్లా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# పరిహారం కోసం మృతదేహంతో బంధువుల రాస్తారోకో

## వీడీబీ కంపెనీ నిర్లక్ష్యంతో అంజయ్య మృతి

## రెండు గంటలకుపైగా రోడ్డుపై రాస్తారోకో

## రూ.20 లక్షలు డిమాండ్ చేసిన మృతుని బంధువులు

## రూ.లక్ష ఇస్తామన్న కాంట్రాక్టర్




**అడ్డగూడూరు, నవంబర్ 15 (క్రైమ్ మిర్రర్):** నేషనల్ హైవే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడని ఆగ్రహించిన మృతుని బంధువులు మృతదేహంతో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకోకు దిగారు. మృతుని కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రెండు గంటలకు పైగా రాస్తారోకో చేయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సంఘటన శుక్రవారం యాదాద్రి జిల్లా అడ్డగూడూరు మండలం చిర్రాగూడూర్ గ్రామం వద్ద జరిగింది. అడ్డగూడూర్ మండలం చిర్రగూడూరు గ్రామానికి చెందిన కమ్మంపాటి అంజయ్య(64) టీవీఎస్ ఎక్సెల్ బండిపై చౌల్లరామారం వెళ్లి తిరిగి గురువారం రాత్రి చిర్రగూడూరు వెళుతుండగా గ్రామ శివారులో ఎలాంటి హెచ్చరిక బోర్డులు పెట్టకుండా నేషనల్ హైవే పనులు చేస్తున్న రోడ్డు రోలర్ డ్రైవర్ ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే అంజయ్య మృతి చెందాడని, మృతుని కుటుంబానికి తగిన పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మృతుని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శుక్రవారం అంజయ్య మృతదేహంతో చిర్రగూడూర్ వద్ద రోడ్డుపై బైఠాయించి రాస్తారోకోకు దిగారు. మృతునిది నిరుపేద కుటుంబమని, రోడ్డు పనులు చేసే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే అంజయ్య మృతి చెందినందున రూ.20 లక్షల పరిహారం ఇచ్చి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామ పెద్దలు కాంట్రాక్టర్ తో చర్చించగా రూ.20 వేలు ఇస్తామని చెప్పగా ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు రెండు గంటలకు పైగా బైఠాయించి రాస్తారోకో చేయడంతో వలిగొండ-తొర్రూరు రోడ్డుపై ఇరువైపులా రాకపోకలు నిలుచిపోవడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. అడ్డగూడూర్ పోలీసులు అక్కడకు చేరుకుని అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించారు. పోలీసులు ఆందోళన విరమించాలని కోరినప్పటికీ మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఎట్టకేలకు రూ.లక్ష ఇస్తామని కాంట్రాక్టర్ అంగీకరించడంతో ఆందోళన విరమించారు. అనంతరం గ్రామంలో అశ్రునయనాల మధ్య అంజయ్య అంత్యక్రియలు నిర్వహించారు.

# బిర్సా పోరాట స్ఫూర్తిని స్మరించుకుందాం

## కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలి





**మంచిర్యాల ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** ఆదివాసీ , గిరిజన హక్కుల కోసం గర్జించిన గొంతుక, బ్రిటిష్ వలసదారులపై పోరాటం చేసిన స్వాతంత్ర్య పోరాట యోధుడు బిర్సా ముండా పోరాట స్ఫూర్తిని స్మరించుకుందామని సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ అధ్యక్షులు అడ్వకేట్ రాజలింగు మోతె అన్నారు. శుక్రవారం బిర్సా ముండా 150 వ జయంతి సందర్భంగా రామకృష్ణాపూర్ పట్టణంలో సంఘం కార్యాలయంలో బిర్సా చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ... ఇప్పటి జార?ండ్ రాష్ట్రంలోని ఉలిహతులో జన్మించిన బిర్సా ముండా, తన 25 ఏళ్ల వయసులోనే బ్రిటిష్ సామ్రాజ్యవాదుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేశారన్నాడు. బ్రిటిష్ పాలకులు, స్థానిక భూస్వాములు గిరిజన భూములను ఆక్రమించి అనేక దురాగతాలకు పాల్పడుతున్న రోజుల్లో బిర్సా ముండా నాటి సామాజిక, ఆర్థిక అన్యాయాన్ని ఎదిరించి నిలిచారన్నారు. అడవి బిడ్డలు తమ భూమిని తామే సాగు చేసుకునే హక్కు కోసం , గిరిజన జాతులు ఆచారాలు, సాంఘిక విలువలకు గౌరవం తీసుకురావడం కోసం పోరాటం చేశారాన్నారు.ఆయన పోరాటం గిరిజనుల న్యాయ సాధనకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందన్నారు.వెనుకబడి ఉన్న గిరిజనుల అభివృద్ధికి, తద్వారా వారి స్వాభిమానాన్ని కాపాడడానికి, పెంపొందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరంకితం కావాల్సిఉందన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక రక్షణలు, హక్కులు అన్వయిస్తూనే వారి జీవనం మెరుగుపరిచే చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. గిరిజనులు వారి జీవనం కోసం ఆధారపడే భూమి,అడవిపై ఆంక్షలు ఎక్కువగా ఉండడంతో, ఉద్యోగాలు తగ్గుతూ.. నిరుద్యోగం పెరుగుతూ వస్తుందన్నారు. భూమి,అడవి ప్రభుత్వ ఉద్యోగాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అటవీ హక్కుల్ని అమలు చేయడం, వాటిపైపంట ఉత్పత్తి పెంచేలాసహకరించడం,అటవీ ఉత్పత్తులకు మార్కెట్ అనుసంధానం చేసి, లాభదాయకంగా ఉండేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. వారి అభివృద్ధి కోసం గిరిజన ప్రాంతాల్లో రోడ్లు,మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన విద్య, ఆహార భద్రత మొదలు అంశాలపై ప్రభుత్వాలు శ్రద్ధ చూపాలన్నారు. ఆ దిశగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తేనే గిరిజన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకుడు చాకిటి రమేష్ పాల్గొన్నారు.


# తుడుం దెబ్బ మహాసభను విజయవంతం చేయండి

## కరపత్రాలను విడుదల చేసిన ఆదివాసీ నాయకులు

**మంచిర్యాల ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని జిల్లాలైన కొమురం భీం, మంచిర్యాల, నిర్మల్,ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ పట్టణ కేంద్రం లోని ఆదివాసీ భవన్ లో ఈ నెల 20 న ఉదయం 10 గంటలకు తుడుం దెబ్బ మహా సభ నిర్వహించనున్నామని మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మంచిర్యాల జిల్లా ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయా సంఘాల నాయకులు తెలిపారు . ఈ మహా సభకి తుడుం దెబ్బ జిల్లా కమిటీ లు,డివిజన్ కమిటీ లు మరియు మండల కమిటీలతో పాటుగా తుడుం దెబ్బ అనుబంధ సంఘాలు,ఆదివాసీ విద్యార్థి, మహిళ,నిరుద్యోగ,రైతు,యువజన సంఘాల నాయకులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని ఆయా సంఘాల నాయకులకు పిలుపునిచ్చారు. ఈ సభ లో తుడుం దెబ్బ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని జిల్లాలైన మంచిర్యాల, కొమురం భీం అసిఫాబాద్,నిర్మల్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల నూతన కమిటీ ల ఎన్నికలను నిర్వహించడం జరుగునని ఆయా జిల్లాల కమిటీ లతో పాటుగా డివిజన్,మరియు మండల కమిటీ ల ఎన్నిక కొరకు పూర్తి స్థాయిలో నాయకులు హాజరు కాగలరని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ నాయకులు కోరారు. అనంతరం ఈ కార్యక్రమం కు సంబంధించిన కరపత్రాలను, గోడ ప్రతులను విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర కో-కన్వీనర్ మరియు మంచిర్యాలజిల్లా ఇంచార్జి కుడిమెత తిరుపతి,సొయం జంగు, తోటి సేవా



సంఘంరాష్ట్రనాయకులుమర్సకోల.బాపురావ్ తోటి సేవా సంఘం మంచిర్యాలజిల్లా ప్రధాన కార్యదర్శి కుర్సెంగ.వెంకటేష్,కోయ సేవా సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఆలం. బాపు,తుడుం దెబ్బ మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్రం వెంకట రాజం,తుడుం దెబ్బ దండేపల్లి మండల ప్రధాన కార్యదర్శి తట్ల. అర్జున్, తుడుందెబ్బ కాసిపేట మండల అధ్యక్షుడు ,ప్రధాన కార్యదర్శి సంద్ర. భూమయ్య,కుర్సెంగ తిరుపతి తో పాటుగా తదితరులు పాల్గొన్నారు



# మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు కు ఆహ్వానము

**మంచిర్యాల ప్రతినిధిక్రైమ్ మిర్రర్:** ఈ నెల 19 న 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు భీమారం మండలం కాజిపల్లి గ్రామంలో నవంబర్ 19 తారీకున జరిగే 71వ అఖిల భారత సహకార వారోత్సవాలకు ముఖ్య అతిథిగా రావాలని శుక్రవారం మందమరిలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా తో సన్మానం చేసి ఆహ్వాన పత్రిక ఇవ్వడం జరిగింద ని తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ తెలిపారు కార్యక్రమం లో దాడి రాజబాబు కొమ్ము సురేందర్ యాదవ్ జాగటి సమ్మయ్య జాడి రాజు వెంకటేష్ పాల్గొన్నారు

# సకినాల విక్రమ్ కి ఘనంగా పుట్టినరోజు వేడుకలు



**మందమర్రి టౌన్ నవంబర్ 15 క్రైమ్ మిర్రర్:** మందమర్రి మార్కెట్ ఏరియా లోని వి3 చలివేంద్రంలో శుక్రవారం సకినాల విక్రమ్ 28వ, పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి కుటుంబ సభ్యుల చేతుల మీదుగా మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది. విక్రమ్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ విక్రం చదువులో తనదైన షైనీలో టెన్త్ క్లాస్ నుండి ఇప్పటివరకు ప్రతి ప్రతిభను కనబడుతూ పీహెచ్డీ వరకు వెళ్లి పీహెచ్డీలో గోల్డ్ మెడల్ సాధించిన సకినాల విక్రమును పలువురు అభినందించారు ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు, ఆటో డ్రైవర్ యూనియన్ నాయకులు, వ్యాపారస్తులు, పలువురు ఈ వేడుకల్లో పాల్గొని విక్రమ్ ను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# కార్తీక పౌర్ణమి వేడుకలలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసినా బాలానగర్ ఏసీపీ, సీఐ..




**బాలానగర్, నవంబర్ 15 (క్రైమ్ మిర్రర్):** శివపార్వతులకు ఎంతో ప్రీతికరమైన కార్తీక పౌర్ణమిని బాలానగర్ డివిజన్ పరధి, కళ్యాణి నగర్ లోని శివాలయంలో పండుగ సందడి నెలకొంది. కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శైవక్షేత్రాలకు భక్తులు భారీగా తరలి వచ్చారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయంలో బాలానగర్ ఏసీపీ హనుమంతా రావు, సీఐ నర్సింహా రాజు హాజరుకాగ ఆలయ కమిటీ సభ్యులు ఏసీపీకి, సీఐకి ఘనంగా స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని భగవంతుని ప్రార్థించినట్లు ఏసీపీ హనుమంతా రావు తెలిపారు.



# రైతులు వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

## పిఏసిఎస్ చైర్మన్ మొగులయ్య కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎల్పటి అశోక్ కుమార్

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** రైతులు వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కుల్కచర్ల పిఏసిఎస్ చైర్మన్ కనకం మొగులయ్య కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎల్పటి అశోక్ కుమార్ సూచించారు. శుక్రవారం చౌడాపూర్ మండల కేంద్రంలోని మల్కాపూర్ మరికల్ కన్మన్ కాల్వ కొత్తపల్లి గ్రామాలలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎవ్వరూ దళారులను నమ్మి మోసపోవద్దు అని అన్నారు. రైతులు తమ యొక్క వడ్లను ఎండబెట్టి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే అమ్ముకోవాలి అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల మేలు కోరి సన్న వడ్లను క్వింటాల్ కి 500 రూపాయల బోనస్ కూడా ఇస్తుంది వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి దామోదర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి,సుదర్శన్ రెడ్డి,సలీమ్,రాజేందర్ రెడ్డి,శేఖర్,నీల్య నాయక్, రమేష్,ఖాదర్,రాములు, శ్రీకాంత్,నరేందర్,మన్యం, నర్సింలు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బి.రాము,అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

భారత బ్యాటర్లు దుమ్మురేపారు. దక్షిణాఫ్రికా గడ్డపై శతక గర్జన చేశారు. సఫారీలను సొంతగడ్డపై సఫా చేస్తూ రికార్డుల మోత మోగించారు. తిలక్‌వర్మ, శాంసన్ సూపర్ సెంచరీలతో కదంతొక్కిన వేళ వాండర్సర్ స్టేడియం పరుగుల వరదలో తడిసి ముద్దయ్యింది. కొడితే సిక్స్ లేదంటే ఫోర్ అన్న రీతిలో తిలక్, శాంసన్ వీరవిహారం చేశారు. సఫారీ బౌలర్లను చెడుగుడు ఆడుకుంటూ బౌండరీల సునామీ సృష్టించారు. బ్యాక్ టు బ్యాక్ సెంచరీతో తిలక్ వీరంగం చేస్తే.. శాంసన్ మరోమారు జూలు విదిల్చాడు. వీరిద్దరి బ్యాటింగ్‌కు ధాటికి రికార్డులు దాసోహం కాగా, విదేశీ గడ్డపై టీ20ల్లో భారత్ అత్యుత్తమ స్కోరు అందుకుంది. భారీ లక్ష్యఛేదనలో కంగుతిన్న దక్షిణాఫ్రికా ఓటమి మూటగట్టుకుంది. ఫలితంగా సిరీస్‌ను భారత్ 3-1తో కైవసం చేసుకుని ట్రోఫీని సగర్వంగా ముద్దాడింది.

# తిలక్ పటాకా.. శాంసన్ తడాఖా

## వాండర్సర్‌లో శతక గర్జన

## నాలుగో టీ20లో భారత్ ఘన విజయం

## భారత్ 20 ఓవర్లలో 283/1





**సంక్షిప్త స్కోర్లు**

**భారత్:** 20 ఓవర్లలో 283/1(తిలక్‌వర్మ 120 నాటౌట్, శాంసన్ 109 నాటౌట్, సింపాల 1/58),

**దక్షిణాఫ్రికా:** 18.2 ఓవర్లలో 148 ఆలౌట్(స్టబ్స్ 43, మిల్లర్ 36, అర్ష్‌దీప్ 3/20, అక్షర్‌పటేల్ 2/6)

జొహాన్నెస్‌బర్గ్: ఈ ఏడాది పొట్టి ఫార్మాట్‌ను భారత్ భారీ విజయంతో ముగించింది. టీ20 ప్రపంచ చాంపియన్‌గా దక్షిణాఫ్రికా గడ్డపై అడుగుపెట్టిన టీమ్‌ఇండియా..సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. కుర్రాళ్లు, సీనియర్ల మేళవింపుతో బరిలోకి దిగిన భారత్ అనుకున్న ఫలితాన్ని సాధించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సూర్యకుమార్‌సేన 135 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. సిరీస్‌ను 3-1తో కైవసం చేసుకుని పొట్టి ఫార్మాట్ రికార్డును మరింత మెరుగుపర్చుకుంది. భారత్ నిర్దేశించిన 284 పరగుల లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా 148/10 స్కోరుకు పరిమితమైంది. స్టబ్స్(43) టాప్‌స్కోరర్. అర్ష్‌దీప్‌సింగ్(3/20 ), అక్షర్‌పటేల్(2/6), చక్రవర్తి(2/42) రాణించారు.

తొలుత హైదరాబాదీ తిలక్‌వర్మ(47 బంతుల్లో 120 నాటౌట్, 9ఫోర్లు, 10 సిక్సులు), శాంసన్(56 బంతుల్లో 109 నాటౌట్, 6ఫోర్లు, 9సిక్సులు) సెంచరీలతో భారత్ 20 ఓవర్లలో 283/1 స్కోరు చేసింది. తిలక్, శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. సఫారీల బౌలర్లను ఊచకోత కోస్తూ ఇద్దరు సెంచరీలతో విజృంభించారు. అంతర్జాతీయ టీ20ల్లో ఒకే ఇన్నింగ్స్‌లో ఇద్దరు సెంచరీలు చేయడం ఇదే తొలిసారి. తిలక్ వరుస మ్యాచ్‌ల్లో సెంచరీలు సాధిస్తే..శాంసన్ తొలి, ఆఖరి పోరులో శతకాలు ఖాతాలో వేసుకున్నాడు. వీరిద్దరు టీ20ల్లో బ్యాక్ టు బ్యాక్ సెంచరీలు చేసిన భారత బ్యాటర్లుగా నిలిచారు. తిలక్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' దక్కాయి.

**తిలక్, శాంసన్ శతక మోత:** టాస్ గెలిచిన భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు అభిషేక్‌శర్మ(36), శాంసన్ మెరుగైన ఆరంభాన్నిచ్చారు. ఇన్నిరోజులు ఫామ్‌లేమితో సతమతమైన అభిషేక్ మళ్లీ టచ్‌లోకి వచ్చాడు. శాంసన్ జతగా సఫారీ బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించాడు. సున్నా పరుగుల వద్ద ఔట్ నుంచి బయటపడ్డ అభిషేక్ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. కొట్జె రెండో ఓవర్‌లో శాంసన్ సిక్స్, ఫోర్‌తో బౌండరీల మోత మొదలైంది. మరోవైపు అభిషేక్ కూడా బ్యాటు ఝులిపించాడు. సిమ్లెన్ ఐదో ఓవర్‌లో మూడు సిక్సులు, ఓ ఫోర్‌తో 24 పరుగులు పిండుకున్నాడు. ఇన్నింగ్స్ జోరందుకుంటున్న తరుణంలో అభిషేక్..సింపాల బౌలింగ్‌లో క్లాసెన్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. పవర్‌ప్లే ముగిసే సరికి టీమ్‌ఇండియా 73/1 స్కోరు చేసింది.ఇక్కణ్నుంచి అసలు సినిమా మొదలైంది. బ్యాటింగ్ ప్రమోషన్‌లో మూడో స్థానంలో వచ్చిన తిలక్‌వర్మ వచ్చిరావడంతోనే సఫారీ బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకపడ్డాడు. మొదట నెమ్మదిగా ఆడిన తిలక్..మహారాజ్ 9వ ఓవర్‌లో రెండు భారీ సిక్సులతో తన ఉద్దేశమేంటో చెప్పాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన స్టబ్స్ ఓవర్‌లో శాంసన్ రెండు సిక్సులు, తిలక్ రెండు ఫోర్లు బాదారు. ఈ క్రమంలో శాంసన్ అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా, అగ్నికి ఆజ్యం తోడైనట్లు తిలక్ కూడా జతకలువడంతో స్కోరుబోర్డుకు పరుగులు వరద ఎత్తాయి. బౌలర్ ఎవరన్నది లెక్కచేయని వీరిద్దరు బౌండరీలతో అభిమానులను అలరించారు.ఒక దశలో శాంసన్ కొట్టిన బంతిని ఒక మహిళా అభిమానికి బలంగా తాకడంతో ఏడుస్తూ కనిపించింది. మార్క్రమ్ 14వ ఓవర్లో తిలక్ వరుస బంతుల్లో 4,6, 6,4తో 22 పరుగులు సాధించాడు. ఒక స్థితిలో శాంసన్ ఆట కొంత మందగించగా, తిలక్ తారాజువ్వలా పేలాడు. కొట్జె 18వ ఓవర్‌లో శాంసన్ సెంచరీ సాధించగా, ఆ మరుసటి ఓవర్‌లో తిలక్ శతక నాదం పూరించాడు. మొత్తంగా వీరిద్దరు ఫోర్లు, సిక్సులతో రెండో వికెట్‌కు 210 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. టీ20ల్లో ఏ వికెట్‌కైనా భారత్‌కు ఇది అత్యుత్తమ భాగస్వామ్యం.

**సఫారీలు పోరాడినా:**

భారీ లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా స్వల్ప స్కోరుకే చాపచుట్టేసింది. యువ పేసర్ అర్ష్‌దీప్‌సింగ్..సఫారీ టాపార్డర్ భరతం పట్టాడు. అర్ష్‌దీప్ ధాటికి హెండ్రిక్స్ (0), మార్క్రమ్(8),క్లాసెన్(0) సింగిల్ డిజిట్ స్కోర్లకు పరిమితమయ్యారు. మిడిలార్డర్‌లో స్టబ్స్ (43), మిల్లర్ (36) పోరాడేందుకు ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఆఖర్లో జాన్సెన్ (29 నాటౌట్) ఒంటరిపోరాటం జట్టును గెలిపించలేకపోయింది.



# రన్నరప్ ప్రజ్ఞానంద

కోల్‌కతా: టాటా స్టీల్ చెస్ ఇండియా ర్యాపిడ్ టోర్నమెంట్ ఓపెన్ విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద రన్నరప్‌గా నిలిచాడు. 10 మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య 9 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో ప్రజ్ఞానంద, సో వెస్లీ (అమెరికా) 5.5 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... ప్రజ్ఞానందకు రెండో స్థానం, సో వెస్లీకి మూడో స్థానం లభించాయి. నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్ 7.5 పాయింట్లతో ర్యాపిడ్ టోర్నీ చాంపియన్‌గా నిలిచాడు. భారత గ్రాండ్‌మాస్టర్లు నిహాల్ సరీన్ (4 పాయింట్లు) ఆరో ర్యాంక్‌లో, ఇరిగేశి అర్జున్ (3.5 పాయింట్లు) ఎనిమిదో ర్యాంక్‌లో, విదిత్ (3 పాయింట్లు) తొమ్మిదో ర్యాంక్‌లో, ఎస్ఎల్ నారాయణన్ (3 పాయింట్లు) చివరిదైన పదో ర్యాంక్‌లో నిలిచారు.

**వంతికకు మూడో స్థానం**

ఇదే టోర్నీ మహిళల ర్యాపిడ్ విభాగంలో భారత యువ క్రీడాకారిణి వంతిక అగర్వాల్ 5 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. 7.5 పాయింట్లతో అలెక్సాండ్రా గొర్యాక్‌చినా (రష్యా) చాంపియన్‌గా అవతరించింది. 5.5 పాయింట్లతో నానా జాగ్‌నిడ్జె (జార్జియా) రన్నరప్‌గా నిలిచింది. భారత్‌కే చెందిన ద్రోణవల్లి హారిక (4.5 పాయింట్లు) ఐదో ర్యాంక్‌లో, దివ్య దేశ్‌ముఖ్ (3.5 పాయింట్లు) ఏడో ర్యాంక్‌లో, వైశాలి (3.5 పాయింట్లు) ఎనిమిదో ర్యాంక్‌లో, కోనేరు హంపి (3 పాయింట్లు) చివరిదైన పదో ర్యాంక్‌లో నిలిచారు.

# దేవాంక్ ధమాకా

## 15 పాయింట్లతో మెరిసిన పట్నా పైరేట్స్ రెయిడర్



నోయిడా: స్టార్ రెయిడర్ దేవాంక్ 15 పాయింట్లతో విజృంభించడంతో ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో పట్నా పైరేట్స్ ఆరో విజయం ఖాతాలో వేసుకుంది. లీగ్‌లో భాగంగా శుక్రవారం జరిగిన పోరులో పట్నా పైరేట్స్ 52%-%31 పాయింట్ల తేడాతో బెంగాల్ వారియర్స్‌పై విజయం సాధించింది. పట్నా తరఫున దేవాంక్ 10 రెయిడ్ పాయింట్లు, 5 బోనస్ పాయింట్లు సాధించగా... అయాన్ 11 పాయింట్లతో సత్తా చాటాడు. సందీప్ కుమార్ (8 పాయింట్లు), దీపక్ రాఠి (5 పాయింట్లు) కూడా రాణించడంతో పట్నా జట్టు ఘనవిజయం సాధించింది. మరోవైపు బెంగాల్ వారియర్స్ తరఫున నితిన్ కుమార్ (11 పాయింట్లు) ఒంటరి పోరాటం చేశాడు. తాజా సీజన్‌లో 10 మ్యాచ్‌లు ఆడిన పట్నా 6 విజయాలు, 4 పరాజయాలతో 33 పాయింట్లు ఖాతాలో వేసుకొని నాలుగో స్థానానికి చేరింది. మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 32%-%24 పాయింట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై గెలుపొందింది. పింక్ పాంథర్స్ తరఫున అర్జున్ దేశ్వాల్ 9 పాయింట్లు, నీరజ్ నర్వాల్ 6 పాయింట్లతో రాణించారు. గుజరాత్ జెయింట్స్ తరఫున గుమాన్ సింగ్ 11 పాయింట్లతో పోరాడిన జట్టును గెలిపించలేకపోయాడు. 9 మ్యాచ్‌లాడిన జైపూర్ 5 విజయాలు, 3 పరాజయాలు, ఒక 'టై'తో 30 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో ఐదో స్థానానికి చేరింది. లీగ్‌లో భాగంగా నేడు జరగనున్న మ్యాచ్‌ల్లో బెంగాల్ వారియర్స్‌తో తమిళ్ తలైవాస్ (రాత్రి 8 గంటలకు), దబంగ్ ఢిల్లీతో బెంగళూరు బుల్స్ (రాత్రి 9 గంటలకు) తలపడనున్నాయి.



## చంద్రబాబుకు వీర విధేయుల్లో ఎన్టీఆర్-లక్ష్మీ పార్వతి సన్నిహితులే

### పుట్టుకతోనే చంద్రబాబు విధేయులం అని చెప్పుకోవడం సిగ్గుచేటు

### విజయసాయి రెడ్డి సంచలన ట్వీట్!

అమరావతి, నవంబర్15(ఆర్ఎన్ఎ): వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి సంచలన ట్వీట్ చేశారు. సీఎం చంద్రబాబుకు వీర విధేయుల్లో కొందరు 30 ఏళ్ల నాటి ఎన్టీఆర్-లక్ష్మీ పార్వతికి అత్యంత సన్నిహితులు అని పేర్కొన్నారు. ఇది చారిత్రక పరిణామం అని, దాచినా దాగని నిజం అని, మార్చలేని సత్యమని విజయసాయి రెడ్డి షాకింగ్ కామెంట్లు చేశారు. వీళ్లంతా 1994-1996లో ఫిరాయింపు దారులని ఆరోపించారు. ఆ విషయం మీడియాకు, ప్రజలకు గుర్తుండదు అని అనుకోవడం వారి అజ్ఞానం అని చెప్పారు. అంతే కాకుండా వాళ్లంతా ఇప్పుడు పుట్టుకతోనే చంద్రబాబు విధేయులం అని చెప్పుకోవడం సిగ్గుచేటు అంటూ ఘాటు విమర్శలు చేశారు. అంతే కాకుండా ఇది ప్రజలను వంచించడం అని అభిప్రాయపడ్డారు. ఫిరాయింపు దారులలో గోరంట్ల బుచ్చయ్య చౌదరి, దాడి వీరభద్రరావు, మాకినేని పెదరత్తయ్య, ప్రతిభా భారతి, కళా వెంకటరావు, చింతకాయల అయ్యన్నపాత్రుడు, గాలి ముద్దుకృష్ణమనాయుడు, చిక్కాల రామచంద్రరావు, పరిటాల రవి, గాదె లింగప్ప, ముక్కు కాశిరెడ్డి, గౌతు శివాజీ, గద్దె బాబూరావు ఉన్నారని తెలిపారు. అంతే కాకుండా ఎన్టీఆర్ కు వెన్నుపోటు పొడిచి బహిష్కరణకు గురైన వారిలో చంద్రబాబు, యనమల, అశోక్ గజపతి రాజు ఉన్నారని చెప్పారు. వీళ్లలో తొంభైశాతం మంది ఎన్టీఆర్ మరణించిన తరవాతనే 1996 లోక్ సభ ఎన్నికల్లో టీడీపీ లక్ష్మీపార్వతి వర్గం ఒక్క సీటు గెలవకపోవడంతో గుట్టుచప్పుడు కాకుండా చంద్రబాబు పార్టీలో చేరారన్నారు. 1997-2004 మధ్య ఉమ్మడి ఏపీ టీడీపీ మంత్రివర్గం సభ్యులుగా కొందరు ఎంపీలుగా, మరికొందరు పార్టీ పదవులు పొందారని వివరించారు. ఇది మాయని మచ్చ అని, చరిత్ర క్షమించదని విజయసాయి రెడ్డి అభిప్రాయపడ్డారు.

# గత పాలనలో

**అచ్చిరాని పాలనలో 30 సంవత్సరాలు వెనక్కుపోయాం**

**రూ. 30 వేల కోట్లు ఇసుక దోపిడీ చేశారు**

**అధికారులను మార్చిమార్చి సమయాన్ని వృథా చేశారు : ఏపీ సీఎం నారా చంద్రబాబు**

# అనుకున్న ఎక్కువే విధ్వంసం..

అమరావతి, (క్రైమ్ మిర్రర్): ఏపీ అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ప్రజలు మహా ఉద్యమంలా మునుపెన్నడూ చూడాని చైతన్యంతో ఓట్లు వేశారన్నారు. 13.5శాతం గ్రోత్ గతంలో సాధించామని తెలిపారు. “2019లో ఒక్కఛాన్స్ అనేమాట చెప్పి అధికారంలోకి వచ్చారు.. నాకు నాలుగు అయిదు నెలలు పట్టింది. జరిగింది చూస్తే అనుకున్న దానికన్నా ఎక్కవ విధ్వంసం జరిగింది” అని తెలిపారు. జీవోలు పెట్టలేదని, సీఏజీకి కూడా లెక్కలు ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో విభజన కన్నా ఈ అయిదు సంవత్సరాలు ఎక్కవ విధ్వంసం జరిగిందన్నారు. రాష్ట్రం 30 సంవత్సరాలు వెనక్కి వెళ్లిపోయిందని చెప్పారు. అసమర్ధ పాలన, అభివృద్ధి నిరోధక నిర్ణయాలు, ప్రజాసంపద దోపిడీ, పన్నుల బాదుడు, స్కాములు కోసమే స్కీములు తెచ్చారని విమర్శించారు. అమరావతి నిర్మాణం ఆపారని.. బ్రాండ్‌ను దెబ్బతీశారన్నారు. పోలవరాన్ని పూర్తిచేసి నదులు అనుసంధానం చేయాలి అంటే పట్టించుకోలేదన్నారు. ఏజెన్సీని మార్చి, ఆఫీసర్లను మార్చి రెండు సంవత్సరాలు పట్టించుకోలేదని.. దీంతో డయాఫ్రాం వాల్ కొట్టుకుపోయిందన్నారు. ప్రభుత్వ టెర్రరిజంతో ఉపాధి అవకాశాలు పోయాయన్నారు. విద్యుత్ రంగంలో లక్ష 29వేల కోట్ల రూపాయలు నష్టం వచ్చిందని వెల్లడించారు. 9వేల కోట్లు కరెంటు వాడుకోకుండా వారికి బకాయిలు కట్టారన్నారు. 7. 25 పైసలు పెట్టి ఓపెన్ మార్కెట్‌లో కరెంట్ కొన్నారన్నారు. ఒక వ్యక్తి తప్పుడు విధానాలు ఎలా వెంటాడుతాయో దీనికి ఉదాహరణ అని అన్నారు. ఇసుకపైనా వ్యాపారం చేశారని.. దోపిడీ చేశారని ఆరోపించారు. రూ.30 వేల కోట్లు ఇసుకలో దోపిడీ చేశారన్నారు. మద్యంలో ఇలా కూడా చేయొచ్చు అని మొదటి సారి చూశానన్నారు. వీళ్లదే మ్యానుఫ్యాక్చరింగ్, వీరే రవాణా, వీరే అమ్మారన్నారు. మద్యం షాపుల్లో ఆన్‌లైన్ లేదని.. సాయంత్రానికి ఆదాయం తాడేపల్లి ప్యాలెస్‌కు రావాలన్నారు. మొన్నటి వరకూ సైకో బ్రాండ్ దొరికిందని... ఇప్పుడు అన్ని దొరుకుతున్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం 57 శాతం ఓట్లతో ఎన్నికల్లో విజయం సాధించామన్నారు. 1994 ఆర్థిక మంత్రిగా తాను చేసిన బడ్జెట్ ప్రసంగంలోని ప్రకటన 30 ఏళ్ల తర్వాత పరిస్థితులకు తగినట్టుగా నిజమైందన్నారు. ఇప్పుడు తెలంగాణా అగ్రస్థానంలో ఉందంటే



దానికి కారణం టీడీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలని తెలిపారు. 2014లో రాష్ట్ర విభజన ఏపీకి తీవ్ర కష్టనష్టాలను మిగుల్చిందని.. కరెంటు ఛార్జీలు పెంచకుండా కొరత నుంచి మిగులు విద్యుత్ సాధించగలిగామన్నారు. రాజధాని కూడా లేకుండా ఉన్న రాష్ట్రానికి అమరావతి నిర్మాణం కోసం ప్రణాళికలు చేశామన్నారు. జీవోలు కూడా ఆన్‌లైన్‌లో లేకుండా గుట్టుగా పాలన చేశారని మండిపడ్డారు. రాజకీయాల్లోకి వచ్చి 45 ఏళ్లు అయినా మాకు ఓ టీవీ,పత్రిక లేవని.. అవినీతి అక్రమాల కోసమే రాజకీయాల్లోకి వచ్చిన వారు.. వస్తూనే టీవీ, పత్రిక పెట్టుకుని పార్టీ పెట్టుకున్నారని విమర్శించారు.

రైతు బజార్లు, తహసిల్దారు కార్యాలయాలను, హెల్త్ సెంటర్లను తాకట్టు పెట్టేశారన్నారు. మద్యంపై వచ్చే ఆదాయాన్ని తాకట్టు పెట్టి 25 వేల కోట్ల అప్పులు తెచ్చారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు కూడా వేయకుండా కేంద్ర పథకాలను నిర్వీర్యం చేశారని వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు రూ.4500 కోట్లతో 30 వేల పనులు సంక్రాంతికే పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెబుతున్నారన్నారు. జల్ జీవన్ మిషన్‌ను పూర్తిగా వినియోగించుకోకుండా నిలిపేశారని తెలిపారు. ఆ ప్రాజెక్టు ఉంటే ఇంటింటికీ కుళాయి వచ్చి సురక్షితమైన తాగునీరు అందరికీ అందేదన్నారు. ఉత్తర ప్రదేశ్ 1 లక్ష కోట్ల రూపాయలతో జల్ జీవన్ మిషన్‌తో తాగునీరు ఇస్తోందన్నారు. ప్రయోగాలతో విద్యా వ్యవస్థను సర్వనాశనం చేశారని మండిపడ్డారు. ఇంగ్లీష్ మీడియం గురించి చెప్పి అందరినీ ఇబ్బంది పెట్టారని.. ఆయనే తొలిసారిగా ఇంగ్లీష్ మీడియంను ప్రవేశపెట్టలేదన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పు రూ. 9,74,556 కోట్లుగా ఇప్పటికి తేలిందన్నారు. ఇప్పుడు తలసరి అప్పు 1.44 లక్షలుగా ఉందన్నారు. “ మా ప్రభుత్వం ఏదీ దాచటం లేదు అందుకే అన్ని జీవోలనూ బహిర్గతం చేస్తున్నాం. గత ప్రభుత్వంలో దాచిపెట్టిన చీకటి జీవోలను కూడా ఆన్ లైన్‌లో పెడుతున్నాం. ఇసుక మేం ఉచితంగా ఇస్తే వైసీపీ టన్నుకు 475 రూపాయలు వసూలు చేసింది. వైసీపీ హయాంలో వ్యక్తిగత ఆదాయం పెరిగి రాష్ట్ర ఆదాయం కూడా తగ్గింది. వ్యవసాయంలో వృద్ధి టీడీపీ హయాంలో 16 శాతానికి పైగా ఉంటే వైసీపీ వచ్చాక 10 శాతానికి తగ్గింది. ఇలా అన్ని వ్యవస్థలూ కలిపి వృద్ధి రేటు 10.6 శాతానికి పడిపోయింది. ఐదేళ్ల కాలంలో 6.94 లక్షల కోట్ల మేర రాష్ట్ర ఆదాయం తగ్గిపోయింది. తలసరి ఆదాయంలో తెలంగాణాతో పోలిస్తే ఏపీ 1.14 లక్షల మేర తక్కువ ఉంది. అమరరాజా బ్యాటరీస్ లాంటి కంపెనీ ఏపీ నుంచి వెళ్లిపోయి హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టారు. ఏపీ అంటే అపనమ్మకం ఏర్పడి పరిశ్రమలు ఎవరూ రాలేదు. 25 వేల కేసుల్లో సీఎస్, ఆర్థిక శాఖ కార్యదర్శి ఇలా ప్రభుత్వ కార్యదర్శులు హైకోర్టులో చేతులు కట్టుకుని నిలబడాల్సిన పరిస్థితి. బటన్ నొక్కాలి కాబట్టి అప్పులు తెచ్చారు. ఒక విష వలయంలా అంతా మార్చేశారు. ఆ పరిస్థితుల్ని వివరించేందుకే 7 శ్వేతపత్రాలను విడుదల చేశాం” అని తెలిపారు.

## పదుల సంఖ్యలో సినీ నటుడు పోసాని కృష్ణమురళిపై కేసులు



అమరావతి, (క్రైమ్ మిర్రర్): వైసీపీ నాయకులు, సినీ నటుడు పోసాని కృష్ణ మురళిపై వరుసగా కేసులు నమోదు అవుతున్నాయి. తాజాగా పాడేరు పోలీస్‌స్టేషన్‌లో పోసానిపై కేసు నమోదు అయ్యింది. ఇప్పటికే పోసానిపై ఏపీ వ్యాప్తంగా పదుల సంఖ్యలో కేసులు నమోదు కావడంతో ఉచ్చు బిగుస్తోంది. పోసానిని అరెస్ట్ చేయాలంటూ పలు డిమాండ్లు వినిపిస్తున్నాయి. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ప్రతిపక్ష పార్టీ అయి టీడీపీ, జనసేన నేతలపై ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు చేశారని.. అతడిని అరెస్ట్ చేయాలని కేసులు నమోదు అవుతున్నాయి. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుపై సోషల్ మీడియాలో పోసాని అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో ఆయనపై ఫిర్యాదు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కరోజే పోసానిపై రాష్ట్ర వ్యాప్తంగా 22 కేసులు నమోదు అయ్యాయి. టీడీపీ, జనసేన నేతలు పోసాని వివిధ పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. వీటిలో ఐదుచోట్ల పోలీసులు కేసులు నమోదు చేశారు. అనంతపురంలో పోసాని దిష్టి బొమ్మను తెలుగు యువత, ఎస్సీ సెల్ నాయకులు దహనం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను అసభ్యకరంగా దూషించారంటూ నమోదైన కేసులో విచారణకు హాజరు కావాలని పోసానికి రెండు, మూడు రోజుల్లో నోటీసులు జారీ చేస్తామని విజయవాడ భవానీపురం పోలీసులు తెలిపారు. అలాగే శ్రీకాకుళం పాతపట్నం పోలీస్‌స్టేషన్‌లో పోసానిపై శ్రీకాకుళం పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షుడు కలమట వెంకటరమణ ఫిర్యాదు చేశారు. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయుడుపై అసభ్య పదజాలంతో వ్యాఖ్యలు చేసినందు గాను పోసానిపై చర్యలు తీసుకోవాలని స్థానిక టీడీపీ నేతలు టెక్కలి పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఎ.విజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అటు విజనగరంలోనూ పోసానిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యారు చేశారు టీడీపీ నేతలు. కూటమి నాయకులపై అనుచిత వాఖ్యలు చేస్తూ వారి మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడిన పోసానిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని టీడీపీ విజయనగరం ప్రధాన కార్యదర్శి ఐపీవీ రాజు ఆధ్వర్యంలో టీడీపీ నేతలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, హోం మంత్రి వంగలపూడి అనిత, ఐటీ మంత్రి నారా లోకేశ్, టీటీడీ చైర్మన్‌పై పోసాని కృష్ణ మురళి అసత్య ఆరోపణలు, పరుస పదజాలంతో మాట్లాడారని, రెచ్చగొట్టే వ్యాఖ్యలను చేసి వారి గౌరవానికి భంగం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రాజాం పోలీస్‌స్టేషన్‌లోనూ పోసానిపై కూటమి నేతలు ఫిర్యాదు చేశారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా పోసాని అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు.

## పినాకా రాకెట్ లాంచర్‌ను పరీక్షించిన డీఆర్‌డీఓ



న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్): పినాకా రాకెట్ లాంచర్‌ను శుక్రవారం డీఆర్డీవో విజయవంతంగా పరీక్షించింది. ప్రపంచవ్యాప్తంగా ఆ వెపన్ సిస్టమ్‌కు డిమాండ్ ఉన్న నేపథ్యంలో.. అడ్వాన్స్‌డ్ గైడెడ్ వెపన్ సిస్టమ్‌ను డీఆర్డీవో డెవలప్ చేసింది. పినాకా ఆయుధ వ్యవస్థకు చెందిన రేంజ్, కచ్చితత్వాన్ని, స్థిరత్వాన్ని, ఫైరింగ్ రేట్‌ను పరీక్షించారు. ప్రొవిజినల్ స్టాఫ్ క్వాలిటేటివ్ రిక్వైర్మెంట్స్ ట్రయల్స్‌లో భాగంగా పినాకా వెపన్ సిస్టమ్‌ను టెస్ట్ చేశారు. పినాకా లాంచర్ల ద్వారా 12 రాకెట్లను ఫైరింగ్ చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మేకిన్ ఇండియా ఉత్పత్తికి రక్షణ శాఖ ఊతం ఇస్తున్న సందర్భంగా ఇతర దేశాలు ఆ వెపన్ సిస్టమ్‌పై ఆసక్తి చూపుతున్నాయి. పినాకా మల్టీ బారెల్ రాకెట్ లాంచర్ పై ఫ్రాన్స్ ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. అమెరికాకు చెందిన హిమార్స్ సిస్టమ్‌తో సమానంగా పినాకా వెపన్ సిస్టమ్‌ను పోల్చుతున్నారు. రక్షణ ఉత్పత్తుల్లో పినాకా ఎగుమతి రికార్డు సృష్టించనున్నది. ఆర్మేనియా తొలుత వీటి కోసం ఆర్డర్ ఇచ్చింది. ఆర్మీని బలోపేతం చేసుకునేందుకు ఫ్రాన్స్ కూడా ఆ వెపన్ సిస్టమ్‌పై ఇంట్రెస్టింగ్‌గా ఉన్నది. మరికొన్ని వారాల్లో ఆ సిస్టమ్‌ను టెస్ట్ చేయనున్నట్లు ఫ్రాన్స్ తెలిపింది. శివుడి విల్లును పినాకం అని పిలుస్తారు. ఆ పేరుతో రాకెట్ సిస్టమ్‌ను డెవలప్ చేశారు. భారత ఆర్మీ వద్ద ఉన్న రష్యన్ గ్రాడ్ బీఎం-12కు రీప్లేస్మెంట్‌గా ఈ రాకెట్ సిస్టమ్‌ను తయారు చేశారు. 1999లో కార్గిల్ యుద్ధ సమయంలో దీన్ని వినియోగించారు. వ్యూహాత్మకంగా ఎత్తు ప్రదేశాల్లో ఉన్న పాకిస్థాన్ స్థావరాలను పికానా సిస్టమ్ ద్వారా పేల్చివేశారు. ఆర్మమెంట్ రీసర్చ్ అండ్ డెవలప్మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఈ పినాకా రాకెట్ సిస్టమ్‌ను డెవలప్ చేసింది. మల్టీ బారల్ రాకెట్ సిస్టమ్‌లో రెండు పాడ్స్ ఉంటాయి. వీటిల్లో ఆరేసి రాకెట్లను నింపుతారు. ఆ తర్వాత కేవలం 44 సెకన్లలోనే ఆ 12 రాకెట్లను ఫైర్ చేస్తారు. 700 %ఇ% 500 మీటర్ల ఏరియా ఆ ఫైరింగ్‌తో నేలమట్టం అవుతుంది. ఆ సిస్టమ్‌లో ఉన్న బ్యాటరీ మొత్తం 72 రాకెట్లను ఫైర్ చేయగలదు.

## నాదొక కోరిక ఉంది..

**అదొక్కటి తీరిస్తే రాజకీయాలకు గుడ్ బై చెప్పేస్తా?**

**సంచలన ట్వీట్ చేసిన మాజీ మంత్రి అంబటి**

అమరావతి, (క్రైమ్ మిర్రర్): నేను రాజకీయాలకు గుడ్ బై చెప్పేస్తా.. అయితే నాదొక కోరిక ఉంది. అదొక్కటి తీరిస్తే నేను రాజకీయాలకు స్వస్తి పలికి కూర్చుంటానంటూ మాజీ మంత్రి అంబటి రాంబాబు సంచలన కామెంట్స్ చేశారు. మీరు సై అంటే నేను సై సై.. అంటాను. అసలు సోషల్ మీడియా యాక్టివిస్టులపై కాదు కేసు పెట్టాల్సింది.. మీపై పెట్టాలి కేసులు. అసెంబ్లీ లో మీ తల్లిని అవమానించినట్లు నిరూపిస్తే.. నేను రాజకీయాలకు గుడ్ బై చెప్పేస్తా. మరి సిద్దమా అంటూ మాజీ మంత్రి అంబటి రాంబాబు తాజాగా నారా లోకేష్ కు ట్యాగ్ చేస్తూ ట్వీట్ చేశారు. ఇటీవల ఏపీలో వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులను పోలీసులు అరెస్ట్ చేస్తున్న విషయం తెలిసిందే. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో హద్దులు దాటిన ఏ ఒక్కరినీ వదిలి పెట్టకుండా పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. అలాగే టీడీపీ, జనసేన కార్యకర్తలు కూడా.. ఒక్కొక్కరిని వెలికితీస్తూ ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ అరెస్టులపై వైసీపీ భగ్గుమంటుండగా, టీడీపీ మాత్రం మహిళల వ్యక్తిగత హనానికి పాల్పడ్డ ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదని చెబుతోంది. తాజాగా మాజీ మంత్రి అంబటి రాంబాబు అరెస్ట్ పర్వంపై ఓ ట్వీట్ చేశారు. అసలు కేసులు నమోదు చేయాలంటే ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు పై ఐపీసీ 420 సెక్షన్ కింద కేసు ఎందుకు పెట్టకూడదు తెలపాలంటూ ప్రశ్నించారు. అలాగే వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఇప్పటి స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు లు ఇష్టారీతిన అనుచిత వ్యాఖ్యలు చేశారని, నాడు సీఎం హెూదాలో గల జగన్ ను ఏక వచనంతో విమర్శించారన్నారు.

## సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలను మభ్యపెట్టిన కూటమి ప్రభుత్వం

**ఇచ్చిన హామీలు తప్పకుండా అమలు చేయాల్సిందే**

**సోషల్ మీడియాలో మిమ్మల్ని ఖచ్చితంగా నిలదీస్తారు : మాజీ మంత్రి రోజా**



అమరావతి, (క్రైమ్ మిర్రర్): ఏపీ సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చి తీరా బడ్జెట్‌లో నిధులు కేటాయించక ప్రజలను మోసం చేస్తున్నారని మాజీ మంత్రి ఆర్‌కె రోజా ఆరోపించారు. ఇచ్చిన హామీలపై పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులు నిన్ను నిలదీస్తూ ఖచ్చితంగా పోస్టులు పెడతారని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలోని యువత, మహిళలను, రైతులను మోసం చేశారని ఆరోపించారు. ఆడబిడ్డ నిధి పథకం కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500ల చొప్పున ఏడాదికి రూ.18వేలు ఇస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ పథకానికి రాష్ట్రంలో 2.07 కోట్ల మంది మహిళలకు రూ.37,313 కోట్లు కేటాయించాల్సి ఉండగా బడ్జెట్‌లో ఎంత కేటాయించారని ప్రశ్నించారు. దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లకు 1,54,47,061 కనెక్షన్లకు రూ.4,115 కోట్లు ఖర్చు అవుతుందని, వాటికి అరకొరా నిధులు కేటాయించారని ఆమె విమర్శించారు. తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ ఏడాదికి రూ.15వేలు ఇస్తామని, అన్నదాతకు ప్రతి రైతుకు ఏడాదికి రూ.20వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తానని బడ్జెట్‌లో తక్కువ కేటాయింపులు చేశారని ఆరోపించారు.

# మొదటి అర్ధ భాగంలో సింగరేణి అదుర్స్...

## గతేడాదితో పోల్చితే వెయ్యి కోట్ల కన్నా ఎక్కువ స్థూల లాభం, 36 శాతం వృద్ధి

### ఆర్థిక క్రమశిక్షణతో పెరిగిన లాభాలు

### స్వయంగా అన్ని శాఖల పనితీరును సమీక్షిస్తున్న సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్

### మంచి స్ఫూర్తినిచ్చిన అవగాహన సదస్సులు

### దీపావళి బోనస్ లతో కొత్త ఉత్సాహంలో కార్మికులు





**భద్రాద్రి కొత్తగూడెం నవంబర్ 15 (క్రైమ్ మిర్రర్):** తీవ్ర వర్ష ప్రభావాన్ని అధిగమిస్తూ, తన వినియోగదారులకు తగినంత బొగ్గును సరఫరా చేస్తూ సింగరేణి సంస్థ గడచిన ఏడు నెలల కాలంలో గతేడాదితో పోల్చితే వెయ్యి కోట్ల కన్నా ఎక్కువ లాభం గడించి ముందుకు దూసుకుపోతోంది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధ భాగంలో భారీ వర్షాల కారణంగా బొగ్గు ఉత్పత్తి కి కొన్ని అవాంతరాలు ఏర్పడినప్పటికీ.. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత ఇప్పుడు మళ్లీ ఉత్పత్తి రథం వేగంగా కదులుతోంది. సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ ఎన్.బలరామ్ ప్రతిరోజు అన్ని ఏరియాలతో ఉత్పత్తి పై ప్రత్యేకంగా సమీక్షిస్తూ, అవాంతరాలను అధిగమించేందుకు రోజువారీగా దిశా నిర్దేశం చేస్తూ లక్ష్యాల సాధన దిశగా అన్ని శాఖలను సమాయత్తం చేస్తున్నారు. ఫలితంగా బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణా, ఓవర్ బర్డెన్ తొలగింపులో గణనీయమైన వృద్ధి కనిపిస్తోంది. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ వార్షిక ఉత్పత్తి లక్ష్యం 720 లక్షల టన్నులను సాధించాలని సింగరేణి వ్యాప్త అధికార యంత్రాంగం సమాయత్తమై పనిచేస్తుంది.

దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు బొగ్గు అమ్మకం ద్వారా రూ.17151 కోట్లు, విద్యుత్ అమ్మకాల ద్వారా రూ.2286 కోట్ల టర్నోవర్ను నమోదు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు బొగ్గు, థర్మల్ విద్యుత్ అమ్మకాల ద్వారా పన్ను చెల్లింపునకు ముందు రూ.4 వేల కోట్ల స్థూల లాభాన్ని కంపెనీ ఆర్జించింది. గతేడాది ఇదే సమయానికి ఆర్జించిన రూ.2932 కోట్ల మీద ఇది 1072 కోట్లు అదనం కావడం విశేషం. మొత్తమ్మీద గతేడాదితో పోల్చితే స్థూల లాభంపై 36 శాతం వృద్ధి నమోదైంది.

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఇటీవలనే సింగరేణి చరిత్రలోనే అత్యధిక లాభాల వాటా 796 కోట్ల రూపాయలను ప్రకటించి చెల్లించేలా ఆదేశాలివ్వడం, అలాగే దీపావళి బోనస్ 358 కోట్ల రూపాయల చెల్లింపుతో పాటు కార్మికుల రక్షణకు సింగరేణి ప్రత్యేక చొరవ చూపడం కూడా వారిలో కార్మిక శ్రేణుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం సహకారం, దిశా నిర్దేశంతో కంపెనీ కల్పించిన కోటి రూపాయల ప్రమాద బీమా వారిలో ధీమాను పెంచుతోంది. అలాగే కొత్తగూడెం ఏరియాలోని వీకే ఓసీ, ఇల్లందు ఏరియాలోని జేకే ఓసీలకు అటవీ అనుమతులు లభించడం సంస్థ భవిష్యత్కు భరోసానిచ్చాయి.

గతంలో ఎవరూ నిర్వహించని విధంగా సంస్థ ఛైర్మన్ ఎన్.బలరామ్ సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని గనుల రక్షణ కమిటీలు, పిట్ కమిటీలు, వర్క్ ఇన్స్పెక్టర్ల లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఏక కాలంలో 40 గనులకు సంబంధించిన 1500 మంది సూపర్వైజరీ సిబ్బందిని ఉద్దేశిస్తూ.. ఉత్పత్తి కన్నా రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్మికులు, సూపర్వైజర్లు ఇచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ సమావేశం కూడా కార్మికుల్లో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపిందని పేర్కొనవచ్చు. అలాగే సంస్థ ఛైర్మన్ స్వయంగా ఏరియాల్లోని వివిధ గనులను తనిఖీ చేస్తూ సంక్షేమంపై దృష్టిసారించడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. కంపెనీ తీసుకుంటున్న ఆర్థిక క్రమశిక్షణ చర్యలు, భూ గర్భ గనుల్లో నష్టాలపై ఉద్యోగులకు కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. అంతేకాక కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు ఖాళీగా ఉన్న సూపర్వైజర్లు మరియు ఇతర అధికారుల పోస్టుల భర్తీకి ఛైర్మన్ తక్షణ చర్యలు తీసుకున్నారు. రెండు ఉద్యోగ నోటిఫికేషన్లకు సంబంధించి మొత్తం 599 మంది కొత్త ఉద్యోగులను ఈ నెలలో నియమించబోతున్నారు. తద్వారా ప్రతి గనిలో ఖాళీగా ఉన్న సూపర్వైజర్లు, అధికారులు, క్లర్కులు వంటి పోస్టుల్లో కొత్త ఉద్యోగులు చేరనున్నారు.

**వాస్తవాలు గ్రహించి ఉత్సాహంగా కదులుతున్న సింగరేణీయులు**

ఇది ఇలా ఉండగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సూచన మేరకు సింగరేణి వ్యాప్తంగా అన్ని గనులు డిపార్ట్మెంట్లలో ఉజ్వల సింగరేణి–ఉద్యోగుల పాత్ర కార్యక్రమాన్ని నిర్వహించి ఉత్పత్తి, ఉత్పాదకత, కార్మికుల బాధ్యత అనే అంశం పైన ప్రత్యేక సమావేశాలు, సామూహిక విందు కార్యక్రమాలను ఇటీవల నిర్వహించడం జరిగింది. ఇందులో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడంపై, యంత్రాల వినియోగాన్ని పెంచడంపై పూర్తి అవగాహన కలిగించారు. దీంతో అన్ని ఏరియాల్లోనూ కంపెనీ యంత్రాల వినియోగాన్ని 14 గంటల నుంచి 20 గంటల వరకు పెంచేలా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా మణుగూరు, రామగుండం–1, ఇల్లందు, కొత్తగూడెం, ఆర్జీ–3, తదితర ఏరియాల్లో ప్రొడక్షన్ డే నిర్వహిస్తూ యంత్రాల వినియోగాన్ని 20 గంటల వరకు పెంచగలిగారు. వర్షాకాలంలో రోజుకు లక్ష టన్నులకు పడిపోయిన ఉత్పత్తి పుంజుకుని ఇప్పుడు 2.2 లక్షల టన్నులకు చేరుకుంటోంది. రానున్న రోజుల్లో ఇది మరింత పెరగనుంది.

మొత్తమ్మీద కష్టించి పని చేస్తేనే కంపెనీ మనుగడ ఉంటుందని, కంపెనీ ఉంటేనే తమకు మనుగడ ఉంటుందన్న విషయాన్ని కార్మికుల్లోకి తీసుకెళ్లగలిగారు. దీంతో ఉత్పత్తి ప్రక్రియలో ఉద్యోగులు అంకితభావంతో పని చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన 5 నెలల కాలంలో నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా ముందుకు సాగుతున్నారు. ఫలితంగా కంపెనీ గతేడాది కన్నా ఎక్కువ అత్యధిక ఉత్పత్తి, లాభాల దిశగా దూసుకెళ్తోంది.



## కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం మత్స్య సహకార సంఘాలకు అండగా ఉంటుంది

### కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి,మండల అధ్యక్షులు బిఎస్ ఆంజనేయులు

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం మత్స్య సహకార సంఘాలకు అండగా ఉంటుందని వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బొలుసని భీమ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్ సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి ఆదేశాలతో శుక్రవారం కుల్కచర్ల మండలం బొమ్మిరెడ్డి పల్లి గ్రామంలోని మంగోలి చెరువులో 14500 చేప పిల్లలను విడుదల చేయడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వంలో ముదిరాజులందరూ అన్ని రంగాలలో రాణించాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ ఎంపీపీ ఆంజనేయులు గౌడ్ రామచంద్రయ్య డైరెక్టర్ బసయ్య అనంతయ్య ఆనందం,మైనారిటీ నాయకులు జలీల్ బాయ్, ఘనాపూర్ శ్రీనివాస్ మత్స్య సహకారం సంఘం అధికారులు మునీందర్,ఏడి వెంకన్న,లక్ష్మి,ఫీల్డ్ ఆఫీసర్ మహేష్,సంఘం అధ్యక్షులు మొగులయ్య,మాజి సర్పంచ్ కృష్ణయ్య,నరసింహారెడ్డి,గ్రామ అధ్యక్షులు మొగులయ్య యువ నాయకులు బుగ్గయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

## కనుల పండుగగా కార్తీక దీపోత్సవం



**పిట్లం క్రైమ్ మిర్రర్ న్యూస్ :** కామారెడ్డి జిల్లా పిట్లం మండలం రాంపూర్(కలాన్),కుర్తి గేటు వద్ద గల శ్రీ సాయి ద్వారకామయి దేవాలయం వద్ద శుక్రవారం కార్తీక మాసం పురస్కరించుకొని పరమ శివుని విగ్రహం వద్ద కార్తీక దీపొస్తవ కార్యక్రమం నిర్వహించారు.మహా శివునికి అభిషేకం,సామూహిక దీపోత్సవం మహిళలు నిర్వహించారు.అనంతరం ఆలయ నిర్వహకులు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ....ప్రతి సంవత్సరం కార్తీకమాసం సందర్భంగా దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు,లక్ష దీపాలను వెలిగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన మహిళలు,చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# తుక్కుగూడలో శ్రీ బాలాజీ లకాన్ మిఠాయి బండర్ లో దారుణం

**బుజు పట్టిన కాలం చెల్లిన మిఠాయిలను విక్రయిస్తున్న స్వీట్ హౌస్ నిర్వాహకులు**

**స్వీట్లు తిన్న ఇద్దరికి అస్వస్థత... అధికారులకు ఫిర్యాదు**

**పదివేల రూపాయలు జరిమాన విధించిన మున్సిపల్ అధికారులు**

**నాణ్యత లోపిస్తే తగిన చర్యలు తప్పవు ం మున్సిపల్ అధికారుల హేచ్చరిక**



**మహేశ్వరం ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ పురపాలక సంఘ%శీ% పరిధిలో బాలాజి లకాన్ స్వీట్ హౌస్ లో యం.అంజయ్య యం.యాదయ్య ఇద్దరు వ్యక్తులు స్వీట్ హౌస్ లో స్వీట్స్ కొనుగోలు చేయడం జరిగింది.వీళ్ళు ఆర్ ఐ జి ఎం లో పని చేస్తారు కొనుగోలు చేసిన స్వీట్ తినగా వాంతులు విరోచనలు కావడం తో సదురు వ్యక్తులు ఫుడ్ సేఫ్టీ అదికారులకు, తుక్కుగూడ మున్సిపల్ ఆఫీసులో అధికారులకు ఫిర్యాదు చేయ స్వీట్ హౌస్ పైన తుక్కుగూడ మున్సిపల్ మేనేజర్ టి. పర్వతాలు ,సీనియర్ అసిస్టెంట్ ఎస్.జంగయ్య మరియు సీనియర్ అసిస్టెంట్ కె.మల్లేశ్ స్వీట్ హౌస్ లో తనిఖీలు చేయగా నాణ్యత లోపమని విషయం నిర్ధార కావడంతో మిఠాయిలు బుజు పట్టి కాలం చెల్లిన మిఠాయి గా గుర్తించడం జరిగింది, యజమానిని విచారణ చేసి హేచ్చరించారు 10 పది వేల రూపాయలు జరిమాన విదించారు ఇలాంటి తప్పులు మల్లి జరుగకుండ చూడాలని తెలియజేసారు.ఎవరైనా నాణ్యత లోపించిన, సమయం దాటిన తినుబండారాలను వినియోగదారులకు విక్రాయించినచో వారిపై తగిన చర్యలు తీసుకోని షాప్ ని సీజ్ చేస్తామని యజమానులకు సూచించారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.